STV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక — తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 326 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 23 అక్టోబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక — తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

## పోలీసులకే హనీట్రాప్!



2



2

### రోజుకు 140 మిలియన్ యూనిట్ల

## థర్మల్ విద్యుత్

- విద్యుత్ కొరత రాకుండా చర్యలు చేపట్టాలి
- మూతపడిన పరిశ్రమల బకాయిలపై 'ఓటీఎస్'
- ఉన్నతాధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

2




## హైదరాబాద్‌లో దక్షిణ రాష్ట్రాల డీజీపీల భేటీ

నేడు టీజీఐసీసీసీలో ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం

.. వివరాలు 2లో

## కాంగ్రెస్ సృష్టించిన కృత్రిమ కరువు

- సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ వైఫల్యంతోనే రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు విమర్శించారు.

వివరాలు 3వ పేజీలో



# కుల గణనలో తప్పులుంటే సరిచేస్తాం



## సొంతగడ్డపై సీఎం సందడి!

కొడంగల్ నివాసంలో ప్రజలు, నేతలతో ఆత్మీయ కలయిక

2

### జాబితాలో లేని వారి వివరాలు ఇవ్వండి

### రాబోయే కేబినెట్ భేటీలో కుల గణనపై ప్రత్యేక చర్చ

### ముదిరాజులను బీసీ-ఏలో చేర్చేందుకు న్యాయ సలహాలు

- పీసీసీని ఒప్పించి ఎమ్మెల్సీ సీట్లు ఇప్పించే బాధ్యత మంత్రి పొన్నానిదే!
- ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమరయ్య, పండుగ సాయన్న విగ్రహాలు
- రవీంద్రభారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకల్లో సీఎం రేవంత్

**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** తెలంగాణలో చేపట్టిన సమగ్ర కుల గణన లెక్కల్లో ఏవైనా తప్పులు దొర్లి ఉంటే వాటిని వెంటనే సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏ కులానికి చెందినవారైనా గణాంకాల్లో తప్పులున్నాయని భావిస్తే, లెక్కల్లోకి రాని వారి వివరాలను నేరుగా ప్రభుత్వానికి అందించాలని కోరారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన మార్పులు చేస్తామని, రాబోయే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని ప్రసంగించారు. బ్రిటిష్ పాలన తర్వాత దేశంలోనే తొలిసారిగా వందేళ్ల నాటి పాత రికార్డులను పక్కనపెట్టి.. ధైర్యంగా సమగ్ర కుల గణన

మిగతా 2 లో



### ఎమ్మెల్సీ, సింగరేణి ఎన్నికలపై

## బీఆర్ఎస్ సమరశంఖం

- రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జిల నియామకం
- కార్మికుల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- తెలంగాణ భవన్‌లో నేతలతో కేటీఆర్ కీలక సమీక్షలు

2

రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల కోసం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ కదనరంగంలోకి దూకింది.

## మరో 30 ఏళ్లు కాంగ్రెస్ అధికారానికి దూరమే

- రాహుల్‌పై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు
- ప్రజల్లోకి వెళ్లకుండా నిరసనలు చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్న
- ఓటు చోరీ ఆరోపణలపై కాంగ్రెస్, మిత్రపక్షాలకు కౌంటర్

4



## నిరసనల వెనుక 'ఇంటర్నేషనల్ నెట్‌వర్క్'!

### ఫాక్స్ న్యూస్ దర్యాప్తు నివేదికలో సంచలన ఆరోపణలు

3




అంతర్జాతీయ నిరసనల వెనుక పలు దేశాలకు విస్తరించిన సంస్థల నెట్‌వర్క్ ఉందంటూ 'ఫాక్స్ న్యూస్' ప్రచురించిన దర్యాప్తు కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన అల్లర్లు, భారత్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనల మధ్య సంబంధాలున్నాయని ఆ కథనం సంచలన ఆరోపణలు చేసింది.



### హైదరాబాద్-విజయవాడ హైవేపై

## ట్రాఫిక్ జామ్

దసరా సెలవులు ముగిసి ప్రజలు తిరిగి నగరానికి పయనమవడంతో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పండుగ సెలవులు ముగించుకుని సిటీకి వస్తున్న వాహనదారులతో హైవే కిటకిటలాడింది.

3

## వికసిత భారత్‌గా తీర్చిదిద్దాలి!

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

3



# హైదరాబాద్‌లో దక్షిణ రాష్ట్రాల డీజీపీల భేటీ!

**నేడు టీజీఐసీసీసీలో ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం**

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**పాల్గొననున్న 5 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు బాస్‌లు**

**కేంద్ర దర్యాప్తు సంస్థలు, భద్రతా బలగాల అధికారుల హాజరు**

**సైబర్ నేరాలు, డ్రగ్స్, ఏఐ వినియోగంపైనే ప్రధాన చర్చ**

**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** దక్షిణాది రాష్ట్రాల మధ్య పోలీసు సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం జరగనుంది. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో నిర్వహించే ఈ భారీ భేటీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ గురువారం వివరాలు వెల్లడించారు. ఈ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లకు చెందిన డీజీపీలు, ఐజీలు హాజరుకానున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు, భద్రతా సంస్థలైన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), సీబీఐ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), ఎన్ఐఏ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ అధికారులు సైతం ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

### ఎజెండాలో కీలక అంశాలివే..

ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలీసు శాఖలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు, పరస్పర సహకారం, సమన్వయంతో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇందులో విస్తృతంగా చర్చించనున్నారు. ముఖ్యంగా ఉగ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాల అనంతర పరిస్థితులు, మాదకద్రవ్యాల (డ్రగ్స్) అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక నేరాలు, యువత నిరసనలు, మానవ అక్రమ రవాణా వంటి కీలక అంశాలు ఈ సమావేశం ఎజెండాలో ఉన్నాయి. అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠాల కదలికలు, నేరగాళ్ల సమాచార మార్పిడి, నేరాల దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు, ఆయా రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచే మార్గాలపై సమీక్షించనున్నారు. వీటితో పాటు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరు, సముద్ర తీర ప్రాంతాల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, పోలీసింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం తదితర అంశాలపైనా ప్రధానంగా చర్చించనున్నారు. దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో పనిచేస్తే సరిహద్దులు దాటి విస్తరిస్తున్న నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్న ప్రధాన లక్ష్యంతోనే ఈ సమన్వయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు డీజీపీ ఆనంద్ స్పష్టం చేశారు.

# పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం!

**రైతులకు మద్దతు ధర దక్కేలా పకడ్బందీ చర్యలు**

**అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష**

**ఈ ఏడాది 133 సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** రాష్ట్రంలో 2026–27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోలు కేంద్రాలను గతేడాది మాదిరిగానే వెంటనే ప్రారంభించి, రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) లభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సెక్రెటేరియట్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సీసీఐ ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం లేకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రస్తుత సీజన్‌లో తెలంగాణ వ్యాప్తంగా 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. (గత సీజన్‌లో 50.73 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, 28.33 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది). కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదికి పత్తి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.8,667గా ప్రకటించగా.. ప్రస్తుతం రాష్ట్రంలో పత్తి మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9,000 పలుకుతోందని అధికారులు తెలిపారు. కనీస మద్దతు ధర కంటే మార్కెట్లో రూ.333 అదనంగా లభిస్తున్నందున, రైతులు ప్రస్తుతానికి బహిరంగ మార్కెట్లలోనే పత్తిని విక్రయించుకోవాలని మంత్రి సూచించారు. ఒకవేళ ధరలు తగ్గి ఎంఎస్పీ కంటే దిగువకు వస్తే అప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని తెలిపారు. పత్తిలో తేమ శాతం, నాణ్యత ఆధారంగా సీసీఐ నిబంధనల ప్రకారం కొనుగోలు ధర నిర్ణయిస్తారని, రైతులు నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### 335 జిన్నింగ్ మిల్లుల నోటిఫై..

ఈ సీజన్‌లో పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ గత ఏడాది ఉన్న 122 కొనుగోలు కేంద్రాల సంఖ్యను 133కు పెంచింది. రాష్ట్రంలో 356 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఇప్పటివరకు 30 జిల్లాల్లో 335 మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు అధికారులు తెలిపారు. కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం జీవోలు 640, 641 ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు పత్తి మార్కెట్ ధరలు, కొనుగోళ్ల పురోగతి, కేంద్రాల్లోని సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. పత్తిని సేకరించి మార్కెట్లకు తరలించే సమయంలో నాణ్యత దెబ్బతినకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

### 'కపాస్ కిసాన్ యాప్'తో పారదర్శకత..

పత్తి కొనుగోళ్లలో పారదర్శకత పెంచేందుకు కపాస్ కిసాన్ యాప్, ఆన్‌లైన్ చెల్లింపులు, రైతుల వివరాల ధ్రువీకరణ వంటి డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నారు. ఇప్పటికే 12,75,185 మంది రైతులకు సంబంధించిన వివరాలను యాప్‌తో అనుసంధానం చేశారు. రైతులు పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే ముందు యాప్‌లో తమ వివరాలను సరిచూసుకోవాలి. సగటు దిగుబడి కంటే ఎక్కువ వచ్చిన రైతులు, కౌలు రైతులు తమ వివరాల నమోదు కోసం భూమి, ఆధార్ వివరాలతో ఏఈవోను సంప్రదించాలి. ఇక పత్తి రైతులకు సమాచారం, సహాయం అందించేందుకు మార్కెటింగ్ శాఖ 1800-599-5779 టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు, 8897281111 వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

# కుల గణనలో తప్పులుంటే సరిచేస్తాం!

- **గోషామహల్ పోలీసు స్మారక పరేడ్‌లో అమరులకు సీఎం ఘన నివాళి**

(మొదటి పేజీ తరువాయి..)

చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని సీఎం రేవంత్ ఈ సందర్భంగా సగర్వంగా పేర్కొన్నారు.

### ముదిరాజులకు బీసీ-ఏ..

ముదిరాజులను బీసీ–ఏ జాబితాలో చేర్చే అంశంపై త్వరలోనే న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం వల్ల గంగపుత్రుల్లో ఉన్న అపోహలను, అనుమానాలను సైతం తొలగిస్తామని స్పష్టం చేశారు. బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని, వారికి విడతలవారీగా సముచిత పదవులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇకపోతే ముదిరాజులకు ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు విషయంలో పీసీసీని ఒప్పించే బాధ్యతను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగిస్తున్నట్లు సీఎం రేవంత్ వెల్లడించారు.

### ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు..

గత పాలనతో పోలిస్తే మెరుగ్గా తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సీఎం వివరించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీతో పాటు రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని గుర్తుచేశారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్యతో పాటు పండుగ సాయన్న విగ్రహాలను సగర్వంగా ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రజల ఆశీర్వాదమే తనకు కొండంత బలమని పేర్కొన్న సీఎం రేవంత్.. దేశంలో బలహీన వర్గాల అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కచ్చితంగా ప్రధానమంత్రి కావాలని పిలుపునిచ్చారు.



# సొంతగడ్డపై సీఎం సందడి!

- **కొడంగల్ నివాసంలో ప్రజలు, నేతలతో ఆత్మీయ కలయిక**
- **ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలపై ఆరా**
- **'పేదల తిరుపతి'లో స్వామివారికి ప్రత్యేక పూజలు**
- **ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన, అధికారులకు సూచనలు**



**కొడంగల్ (సమయం న్యూస్):** దసరా పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని తన నివాసంలో నియోజకవర్గ ప్రజలు, స్థానిక నాయకులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, అభిమానులు, నాయకులు ముఖ్యమంత్రిని కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం రేవంత్ సైతం ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పండుగ వేళ ప్రజలు, నాయకులతో సాగిన ఈ ఆత్మీయ కలయిక కొడంగల్‌లో పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది. కొడంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీఎం రాకతో నియోజకవర్గంలో పండుగ సందడి నెలకొంది. కొడంగల్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ.110 కోట్లతో చేపట్టిన పనులను రేవంత్ రెడ్డి పరిశీలించారు. నాలుగు వైపులా రాజగోపురాలు, మాడవీధులు, పుష్కరిణి నిర్మాణంతో పాటు భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ, జిల్లా అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి పి.వి.శ్రీనివాసరాజు తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఆలయ పనుల పరిశీలన అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి స్థానికులు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలతో కార్యాలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రజల వద్దకు వెళ్లిన రేవంత్ రెడ్డి వారి సమస్యలు, వినతులను స్వయంగా స్వీకరించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అక్కడే ఉన్న అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనిత, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, ఎంపీడీవో జయశ్రీ, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విజయదశమి సందర్భంగా కొడంగల్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సందడితో కొడంగల్‌లో పండుగ వాతావరణం నెలకొంది.



# రోజుకు 140 మిలియన్ యూనిట్ల థర్మల్ విద్యుత్!

**రబీ, వేసవికి విద్యుత్ కొరత రాకుండా చర్యలు చేపట్టాలి**

**మూతపడిన పరిశ్రమల బకాయిలపై 'ఓటీఎస్' విధానం**

**విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున, రానున్న రబీ, వేసవి సీజన్లలో విద్యుత్ కొరత రాకుండా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో విద్యుత్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, దాన్ని మరింత పెంచాలన్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లోని ఐదో యూనిట్‌ను త్వరితగతిన పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ ప్లాంట్‌కు నవంబర్ నుంచి కోల్ ఇండియా ద్వారా ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా ప్రారంభం కానుందని అధికారులు వివరించారు.

### మూతపడిన పరిశ్రమలకు ఓటీఎస్..

రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమల పెండింగ్ విద్యుత్ బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానం తీసుకురావాలని, ఇందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. దీనివల్ల పరిశ్రమలకు వెసులుబాటుతో పాటు పంపిణీ సంస్థలకు బకాయిలు వసూలవుతాయన్నారు. సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కోలకు వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అధికారుల నవీన్ మిట్టల్, సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, డిస్కంల సీఎండీలు పాల్గొన్నారు.

# నిరసనల వెనుక ఇంటర్నేషనల్ నెట్‌వర్క్!

- **నిరసనల వెనుక ఇంటర్నేషనల్ నెట్‌వర్క్!**
- **ఫాక్స్ న్యూస్ దర్యాప్తు నివేదికలో సంచలన ఆరోపణలు**
- **9 దేశాల్లోని 101 సంస్థల మధ్య లింకులు**
- **ఫ్రాన్స్ అల్లర్లు, భారత్‌లో సీఈసీకి వ్యతిరేకంగా నిరసనల ప్రస్తావన**
- **చైనాకు చెందిన నెవిల్ రాయ్ సింగమ్ నిధులు**
- **ఐఏపీ, కోడ్‌పింక్ సంస్థల పాత్రపై కీలక వివరాలు**



**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** అంతర్జాతీయ నిరసనల వెనుక పలు దేశాలకు విస్తరించిన సంస్థల నెట్‌వర్క్ ఉందంటూ 'ఫాక్స్ న్యూస్' ప్రచురించిన దర్యాప్తు కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన అల్లర్లు, భారత్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనల మధ్య సంబంధాలున్నాయని ఆ కథనం సంచలన ఆరోపణలు చేసింది. తొమ్మిది దేశాల్లోని 101 సంస్థలు నిరసనలకు మద్దతు ఇవ్వడం, వాటిని నిర్వహించడం, ప్రచారం చేయడంలో పరస్పరం సహకరించుకుంటున్నాయని వెల్లడించింది.

### 'రెడ్-గ్రీన్ ప్రొటెస్ట్ ఎకోసిస్టమ్'..

ఫాక్స్ న్యూస్ సీనియర్ ఎడిటర్ అస్రా నోమానీ రూపొందించిన 'గ్లోబల్ ఖయాస్ ఇంక్ గ్రోస్ టు 101 గ్రూప్స్' నివేదికలో ఈ వ్యవస్థను 'రెడ్–గ్రీన్ ప్రొటెస్ట్ ఎకోసిస్టమ్'గా అభివర్ణించారు. కమ్యూనిస్టు, ఇస్లామిస్ట్ భావజాలాలతో సంబంధాలున్నాయని నివేదిక పేర్కొన్న కొన్ని సంస్థలతో పాటు కార్మిక, విద్యార్థి సంఘాలు, ప్రచార నెట్‌వర్క్‌లు, మీడియా సంస్థలు కూడా ఈ వ్యవస్థలో భాగంగా ఉన్నాయని ఆరోపించింది. అమెరికా, బ్రిటన్, గ్రీస్, బ్రెజిల్, భారత్ సహా పలు దేశాలకు ఈ నెట్‌వర్క్ విస్తరించిందని స్పష్టం చేసింది.

### ఇండియన్ అలయన్స్ పారిస్ పాత్ర..

ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఇండియన్ అలయన్స్ పారిస్ (ఐఏపీ)' సంస్థను నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఫ్రాన్స్, భారత్‌లోని నిరసనలకు సంబంధించిన సందేశాలను అనుసంధానించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని ఆరోపించింది. న్యూయార్క్‌లోని పీపుల్స్ ఫోరమ్‌తోనూ దీనికి భాగస్వామ్యం ఉన్నట్లు పేర్కొంది. ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థ అక్టోబరు 16న తన వెబ్‌సైట్‌లో ప్రచురించిన కథనంలో ఫ్రాన్స్, స్పెయిన్, భారత్, అల్బేనియాల్లో జరుగుతున్న నిరసనలను ఒకే సందర్భంలో ప్రస్తావించిన విషయాన్ని కూడా నివేదిక ఉదహరించింది.

### విదేశీ నిధులు.. సింగమ్ లింక్స్..

యూరప్‌లోని నిరసనలకు కమ్యూనిస్టు భావజాలంతో సంబంధాలున్న సంస్థలు మద్దతు ఇస్తున్నాయని అస్రా నోమానీ నివేదిక పేర్కొంది. బ్రేక్‌త్రూ న్యూస్, కోడ్‌పింక్, పార్టీ ఫర్ సోషలిజం అండ్ లిబరేషన్ సంస్థల పేర్లను ప్రస్తావించింది. చైనాలో నివసిస్తున్న అమెరికాలో జన్మించిన వ్యాపారవేత్త నెవిల్ రాయ్ సింగమ్ ఈ సంస్థలకు నిధులు లేదా ఇతర రూపాల్లో మద్దతు అందిస్తున్నారని ఆరోపించింది. కోడ్‌పింక్ వ్యవస్థాపకురాలు జోడీ ఇవాన్స్ అక్టోబరు 14న బ్రేక్‌త్రూ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫ్రాన్స్, స్పెయిన్, భారత్‌లో జరుగుతున్న నిరసనలను ప్రస్తావిస్తూ.. ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చినట్లు నివేదిక తెలిపింది. ఐఏపీ కార్యదర్శి, భారత సంతతికి చెందిన జర్నలిస్టు జాయ్ బెనర్జీకి ఫ్రెంచ్ కార్మిక సంఘం సీజీటీతో గతంలో సంబంధాలు ఉండటంతో పాటు, ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీతోనూ అనుబంధం ఉందని కథనం ఆరోపించింది.

# ఎమ్మెల్సీ, సింగరేణి ఎన్నికలపై బీఆర్ఎస్ సమరశంఖం!

- రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జిల నియామకం
- అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి
- కార్మికుల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- సింగరేణి టెండర్లలో కాంగ్రెస్ సర్కార్ అవకతవకలను ఎండగట్టాలి
- తెలంగాణ భవన్‌లో నేతలతో కేటీఆర్ కీలక సమీక్షలు



**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల కోసం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ కదనరంగంలోకి దూకింది. ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గులాబీ దళం.. క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేసేందుకు వ్యూహరచన చేసింది. గురువారం తెలంగాణ భవన్‌లో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. ముందుగా ఖమ్మం-వరంగల్- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక ఇన్‌ఛార్జిలను నియమించారు. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలను ఏకం చేస్తూ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించడాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని కేటీఆర్ ఇన్‌ఛార్జిలను ఆదేశించారు.

### కార్మికుల హక్కుల విషయంలో రాజీ లేదు..

మరోవైపు సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ నుంచి కాపాడటంతో పాటు కార్మికుల హక్కులు, సంక్షేమ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. గోదావరిఖనిలో సింగరేణి కార్మిక గర్జన సభ విజయవంతమైన నేపథ్యంలో.. సింగరేణి ప్రాంత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. సింగరేణి ఆర్థిక వ్యవహారాలు, బొగ్గు ఉత్పత్తి తగ్గుదల, టెండర్లలో అక్రమాల ఆరోపణలు, సంస్థకు రావాల్సిన నిధుల అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సంస్థ ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలపై కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలను నిలదీయాలన్నారు.

### బీఆర్ఎస్ హయాంలో చేసిన మేలు వివరించాలి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అందించిన లాభాల వాటా, కారుణ్య ఉద్యోగాలు, వైద్య సదుపాయాలు తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కేటీఆర్ నేతలకు సూచించారు. కార్మికులకు రావాల్సిన బోనస్, ఇతర ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే వెంటనే ప్రశ్నించాలన్నారు. త్వరలో జరగనున్న సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ, టీబీజీకేఎస్ నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని, సంఘం బలోపేతానికి విశేష కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజిరెడ్డి, కాపు కృష్ణ, ప్రభాకర్ రావు, వీరభద్రం, గడప రాజయ్య, నాగెల్లి వెంకటేశ్వర్లు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకే హనీట్రాప్ వల!

- అందమైన అమ్మాయిల పేరుతో 47 నకిలీ ఖాతాలు
- బుక్కైన 82 మంది పోలీసులు.. వెయ్యికి పైగా బాధితులు
- ప్రైవేట్ వీడియోలతో బ్లాక్‌మెయిలింగ్.. లక్షల్లో వసూళ్లు
- డీఐ బాలస్వామికి కుచ్చుటోపీ.. ప్రధాన నిందితుడు పవన్‌కుమార్ అరెస్ట్



**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** అందమైన అమ్మాయిల పేరుతో సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకుని, తీయని మాటలతో నమ్మించి, ఆపై ప్రైవేట్ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్న అంతర్రాష్ట్ర హనీట్రాప్ ముఠా గుట్టును హైదరాబాద్ సిటీ పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు కొండబత్తుల పవన్‌కుమార్ రావును అరెస్టు చేశారు. సామాన్యులనే కాకుండా చట్టాన్ని కాపాడే పోలీసు అధికారులనూ లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠా ఉచ్చులో ఏకంగా 82 మంది పోలీసులు చిక్కినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఓ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం కోల్పోయి ప్రస్తుతం రిమాండ్‌లో ఉండగా, మరో ఏసీపీ విచారణను ఎదుర్కొంటున్నారు. బాధితుల సంఖ్య వెయ్యికి పైగా ఉండగా.. ఈ నెట్‌వర్క్ ఏకంగా నాలుగు దేశాలకు విస్తరించినట్లు పోలీసులు గుర్తించారు.

### నకిలీ ఖాతాలతో వల.. వీడియోలతో బెదిరింపులు..

పోలీసుల విచారణలో పవన్‌కుమార్ తన మాజీ ప్రియురాలితో కలిసి ఈ దందా సాగించినట్లు తేలింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 33, ఫేస్‌బుక్‌లో 14 నకిలీ ఖాతాలను సృష్టించి, వాటికి అందమైన అమ్మాయిల ఫొటోలను ప్రొఫైల్ చిత్రాలుగా పెట్టేవాడు. ప్రధానంగా పోలీసు అధికారులకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపి, పరిచయం పెరిగిన తర్వాత శృంగారపరమైన సంభాషణలకు తెరతీసేవాడు. వీడియో కాల్స్ సమయంలో బాధితుల ప్రైవేట్ దృశ్యాలను రికార్డు చేసి, వాటిని మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగేవాడు. వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగాలు పోయేలా చేస్తామని భయపెట్టి డబ్బులు వసూలు చేసేవాడు. తాము మాట్లాడుతున్నది అమ్మాయి కాదని తెలిసిన తర్వాత కూడా కొందరు అధికారులు అతనితో చాటింగ్ కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు.

### డీఐ బాలస్వామికి పెళ్లి పేరుతో టోకరా..

ఈ వ్యవహారంలో ఖైరతాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) బాలస్వామి ఉదంతం సంచలనం రేపింది. పవన్‌కుమార్ 'చందన' అనే పేరుతో నకిలీ ఖాతాను సృష్టించి, ఆమె తన బంధువని, ఆమెతో పెళ్లి జరిపిస్తానని బాలస్వామిని నమ్మించాడు. వాస్తవానికి చందన అనే వ్యక్తి లేకపోయినా, ఆమె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోందని చెప్పి వైద్య ఖర్చుల పేరుతో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంతటితో ఆగకుండా బాలస్వామిని భార్యాపిల్లలకు దూరంగా దాదాపు ఆరు నెలలపాటు ఓ లాడ్జిలోనే ఉండేలా చేసి మానసికంగా వేధించినట్లు ఆరోపణలున్నాయి. ఇంటికి వెళితే అక్రమ కేసులు పెట్టి ఉద్యోగం పోగొడతానంటూ బెదిరించినట్లు సమాచారం. బాలస్వామి భార్య గంజి హరిత ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం బాలస్వామి ఈ కేసుకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో అరెస్టయి రిమాండ్‌లో ఉన్నారు.

# వికసిత భారత్‌గా తీర్చిదిద్దాలి!

- 'అలాయ్ బలాయ్' వేదికగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు
- రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ కలయిక అన్న దత్తాత్రేయ



**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** భారత దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గురువారం అంగరంగ వైభవంగా జరిగిన 'అలాయ్ బలాయ్ ఉ 2026' ఉత్సవాల వేదికగా ఆయన దేశ ప్రగతి, ఐక్యతపై కీలక ప్రసంగం చేశారు. సమాజంలో ఆకలిదప్పులు లేని అభ్యుదయ వాతావరణాన్ని నిర్మించడంతో పాటు అవినీతికి, అఘాయిత్యాలకు ఏమాత్రం తావులేని విధంగా భారత దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

గతంలో భారతీయుల మధ్య ఉన్న చిన్నపాటి విభేదాలను, లొసుగులను బ్రిటిష్ పాలకులు తమకు అనుకూలంగా మలుచుకుని దేశాన్ని సుదీర్ఘకాలం పాలించారని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. ఆ క్రమంలో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నాటి విభజన రాజకీయాల నుంచి నేర్చుకున్న పాఠాలతో ప్రస్తుత తరుణంలో ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. మనుషుల మధ్య ఉన్న ద్వేషాలను పక్కనబెట్టి ప్రేమను పంచుతూ ఆత్మీయ అనుబంధాలను బలోపేతం చేసే ఒక గొప్ప సామాజిక వేదిక అలాయ్ బలాయ్ అని ఆయన కొనియాడారు. మానవత్వాన్ని మేల్కొలిపి ముందుకు తీసుకెళ్లే ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన సంస్కృతిని, అనుబంధాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు.

### ఈ ఏడాది ఇతివృత్తం 'నషా ముక్త్ భారత్'

హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నాయకత్వంలో, అలాయ్ బలాయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 20వ వార్షిక ఉత్సవాల్లో ఈసారి 'నషా ముక్త్ భారత్' (వ్యసన రహిత భారతం) అనే ప్రధాన నినాదంతో యువతను చైతన్యపరిచారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలైన బతుకమ్మ, బోనాలు, గిరిజన గుస్సాడీ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో పాటు నోరూరించే తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ఈ వేడుకలు అత్యంత కోలాహలంగా సాగాయి. ఈ కార్యక్రమంలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, సీనియర్ నేత వి.హనుమంతరావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు సహా రాజకీయ, సినిమా, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అలాయ్ బలాయ్ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకో పరిమితమైనది కాదని, ఇది పూర్తిగా సాంస్కృతిక, సామాజిక వేదిక అని బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. భిన్న రాజకీయ భావజాలాలు, విబేధాలు ఉన్నప్పటికీ నాయకులందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయతను చాటుకునేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రెండు కళ్ల లాంటివని, ఇరు రాష్ట్రాల ప్రజలు ప్రాంతీయ భేదాలు మరిచి పరస్పర సహకారంతో కలిసికట్టుగా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఉత్సవాలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఈ ఏడాది 'నషా ముక్త్ భారత్' (మత్తు రహిత భారతదేశం) నినాదాన్ని తీసుకున్నామన్నారు. ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటుండటం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన యువతను కాపాడుకోవడానికి వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. వెంకయ్యనాయుడు ఆకాంక్షించినట్లుగానే.. భారత దేశాన్ని 2047 నాటికి 'వికసిత్ భారత్'గా మార్చాలనే సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలన్నారు. ఆకలి కేకలు లేని అభ్యుదయ సమాజాన్ని నిర్మించాలని, అవినీతి, అఘాయిత్యాలకు తావులేని విధంగా దేశాన్ని బలోపేతం చేయాలన్నారు. బ్రిటిష్ వారు చేసిన విభజన రాజకీయాల నుంచి పాఠాలు నేర్చుకుని మనమంతా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలన్నారు. గత రెండు దశాబ్దాలుగా అలాయ్ బలాయ్ కార్యక్రమం తెలంగాణ గ్రామీణ కళలకు, జానపద నృత్యాలకు, సంప్రదాయ వంటకాలకు ఒక అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చిందని ఆయన సగర్వంగా ప్రకటించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత అని గుర్తుచేశారు.

# కాంగ్రెస్ సృష్టించిన కృత్రిమ కరువు!

**రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో ఎండుతున్న పంటలు**

**ఎలినినో ముందస్తు హెచ్చరికలను పట్టించుకోని ప్రభుత్వం**

**రాజకీయ కక్షతోనే మల్లన్నసాగర్‌కు నీళ్లు ఎత్తలేదు**

**తక్షణమే కరువు మండలాలు ప్రకటించి పరిహారం ఇవ్వాలి**

**సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం**

**సిద్దిపేట, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ వైఫల్యంతోనే రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు విమర్శించారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు ప్రకృతి వైపరీత్యాలు కారణం కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యమే కారణమని ఆరోపించారు. దీనిని కాంగ్రెస్ సృష్టించిన కృత్రిమ కరువుగా ఆయన అభివర్ణించారు. ఎల్‌నినో ప్రభావంతో నీరు, విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు, నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదని హరీశ్‌రావు ఆరోపించారు. సకాలంలో సమీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోకపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయని పేర్కొన్నారు. విద్యుత్ కోతల కారణంగా పంటలను కాపాడుకునేందుకు రైతులు జనరేటర్లు, ఇన్వర్టర్లపై ఆధారపడాల్సి వస్తోందని, కేసీఆర్ పాలనలో దూరమైన కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ సమస్యలపై రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని మండిపడ్డారు. సస్పెండ్ చేయాల్సింది అధికారులను కాదని, ముఖ్యమంత్రిని, విఫలమైన విద్యుత్ శాఖ మంత్రిని అని వ్యాఖ్యానించారు.



మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి పొరుగు రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి రైతులకు పరిహారం అందిస్తున్నా.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే రాజకీయ కక్షతోనే మల్లన్నసాగర్‌ను నింపకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) కన్నెపల్లి వద్ద మోటార్లు నడిపేందుకు అనుమతించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. మల్లన్నసాగర్‌కు నీటిని ఎత్తిపోసి ఉంటే సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ వినియోగించుకోలేని ప్రభుత్వ అసమర్థత వల్లే కృత్రిమ కరువు ఏర్పడిందని దుయ్యబట్టారు. రాబోయే 20 రోజులపాటు రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తే మిగిలిన పంటలైనా చేతికొస్తాయన్నారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా కరువు మండలాలను ప్రకటించి, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్



**చౌటుప్పల్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** దసరా సెలవులు ముగిసి ప్రజలు తిరిగి నగరానికి పయనమవడంతో హైదరాబాద్ ఉ విజయవాడ జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పండుగ సెలవులు ముగించుకుని సిటీకి వస్తున్న వాహనదారులతో హైవే కిటకిటలాడింది. ముఖ్యంగా చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాహనాలు ముందుకు కదలక అత్యంత నెమ్మదిగా సాగాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాల కోసం ఏకంగా 10 టోల్ బూత్ లను ఓపెన్ చేసినప్పటికీ ట్రాఫిక్ రద్దీని పూర్తిగా నియంత్రించలేకపోయారు. కాగా, దసరా పండుగ సందర్భంగా ఈ పది రోజుల్లో జాతీయ రహదారిపై సుమారు ఏడు లక్షల వాహనాలు రాకపోకలు సాగించినట్లు అధికారులు వెల్లడించారు. పండుగ రద్దీని ముందే అంచనా వేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఆస్ట్రేలియా పర్యటనకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి!

**ఈ నెల 25 నుంచి 30 వరకు సిడ్నీ, మెల్‌బోర్న్‌లలో టూర్**

**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** భారత్-ఆస్ట్రేలియా మధ్య గనులు, క్రిటికల్ మినరల్స్, ఆధునిక సాంకేతికత రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఈనెల 25 నుంచి 30 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. దేశంలో పెరుగుతున్న ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ అవసరాలకు అనుగుణంగా క్రిటికల్ మినరల్స్ సరఫరాను పెంచుకోవడం, మైనింగ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. 25న సిడ్నీకి చేరుకోనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. 26న నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) సిడ్నీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఇంటర్నేషనల్ మైనింగ్ అండ్ రిసోర్సెస్ కాన్ఫరెన్స్ (ఐఎంఏఆర్సీ)- 2026లో పాల్గొని 'ఇండియా పెవిలియన్'ను ప్రారంభిస్తారు. 27, 28 తేదీల్లో ఆస్ట్రేలియా మంత్రులు మడలైన్ కింగ్, ఆంథనీ చిషోల్మ్‌లతో పాటు మినరల్స్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా, ప్రధాన మైనింగ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతారు. 28న మెల్‌బోర్న్‌లో పబ్లిక్ సెక్టార్ యూనిట్ 'ఎన్‌బీసీసీ' ఆస్ట్రేలియా శాఖను కిషన్ రెడ్డి ప్రారంభిస్తారు. ఆయన సమక్షంలో ఎన్‌బీసీసీ-గోల్డ్ ఫీల్డ్స్ ఆస్ట్రేలియా మధ్య అవగాహన ఒప్పందం జరగనుంది. అనంతరం ప్రవాస భారతీయులతో భేటీ అవుతారు. 29న మోనాష్ విశ్వవిద్యాలయంలో జరిగే సదస్సులో పాల్గొంటారు. విక్టోరియా ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ (ూబం×వీవీ) శాస్త్రవేత్తలతో పర్యావరణహిత మైనింగ్, పెట్టుబడులు, నూతన సాంకేతికతపై చర్చిస్తారు.

## సంపాదకీయం



# సౌదీలో బంగ్లాదేశ్ జంటకు మరణశిక్ష?

## భారతీయుడి ప్రమేయమంటూ ప్రచారం!

మక్కా మసీదులో అనైతిక చర్యల ఆరోపణలతో శిక్ష విధించినట్లు కథనాలు

భారతీయుడే వీడియో తీశాడంటూ పాకిస్తాన్ పోస్టులు

వీడియోతో బెదిరింపులు.. అధికారులకు సమాచారం ఇచ్చాడంటూ ప్రచారం

భారతీయుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించారన్న వాదనకు అధికారిక ఆధారాల కొరత

బంగ్లాదేశ్ జంట అరెస్టులపై కుటుంబ సభ్యుల అభ్యంతరాలు

మరణశిక్ష అమలు, భారతీయుడి పాత్రపై స్వతంత్ర నిర్ధారణ అవసరం

సౌదీ అరేబియాలో బంగ్లాదేశ్‌కు చెందిన నజ్రుల్ ఇస్లాం అబ్దుల్ బసీర్, స్వీటీ అక్తర్ అనే ఇద్దరికి మరణశిక్ష అమలు చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. మక్కాలోని ఓ మసీదులో అనైతిక చర్యకు పాల్పడ్డారనే అభియోగంపై అక్టోబర్ 14న వీరికి మరణశిక్ష అమలు చేసినట్లు సౌదీ అంతర్గత వ్యవహారాల శాఖ ప్రకటించింది. అయితే, వారు ఏ చర్యకు పాల్పడ్డారనే విషయాన్ని అధికారిక ప్రకటనలో స్పష్టంగా వెల్లడించలేదు. ఇద్దరి మధ్య ఉన్న సంబంధం, శిక్ష అమలు చేసిన విధానంపైనా పూర్తి వివరాలు అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ముఖ్యంగా ఓ భారతీయుడు ఈ ఘటనను వీడియో తీసి అధికారులకు అందించాడంటూ పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన కొన్ని సామాజిక మాధ్యమాల ఖాతాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, భారతీయుడి ప్రమేయాన్ని నిర్ధారించే అధికారిక ఆధారాలు ఇప్పటివరకు వెలుగులోకి రాలేదు.

### భారతీయుడే వీడియో తీశాడా?

అక్టోబర్ 20 నుంచి ప్రచారంలోకి వచ్చిన కొన్ని పోస్టుల ప్రకారం మక్కాలోని మస్జిద్ అల్ హరామ్‌లో క్లీనర్లుగా పనిచేస్తున్న నజ్రుల్, స్వీటీ మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడిందని పేర్కొన్నారు. మసీదులోని 85, 87 గేట్ల మధ్య ఉన్న గదిలో ఇద్దరూ అనైతిక చర్యకు పాల్పడుతున్న సమయంలో ఓ భారతీయుడు వీడియో తీశాడని ప్రచారం చేశారు. అనంతరం ఆ వీడియోతో స్వీటీని బెదిరించేందుకు ప్రయత్నించి, చివరకు సౌదీ అధికారులకు అందించాడని ఆరోపించారు. ఆ భారతీయుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించారనే కథనాలు కూడా ప్రచారంలో ఉన్నాయి. అయితే, ఈ వివరాలకు సంబంధించి విశ్వసనీయమైన అధికారిక ధ్రువీకరణ లేదు.

### పాకిస్తాన్ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం

ఈ ఘటనకు సంబంధించిన పలు కథనాలు పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన సామాజిక మాధ్యమాల ఖాతాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఆ తర్వాత ఇతర దేశాలకు చెందిన ఖాతాల్లోనూ అవే కథనాలు కనిపించాయి. మరోవైపు, బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరి మరణశిక్షకు సంబంధించినవిగా ప్రచారమైన కొన్ని ఫొటోలు, వీడియోలు పాత ఘటనలకు చెందినవని నిజనిర్ధారణ సంస్థలు వెల్లడించాయి. మరణశిక్ష అమలుకు సంబంధించినదిగా ప్రచారమైన ఓ వీడియో 2015 నాటిదని, మక్కాలో తీసినట్లుగా ప్రచారమైన మరో ఫొటో ఈ ఘటనతో సంబంధం లేనిదని తేల్చాయి.

### 2023 నుంచే సౌదీ నిర్బంధంలో ఇద్దరు

బంగ్లాదేశ్‌లోని ప్రముఖ దినపత్రిక 'ది డైలీ స్టార్' వెల్లడించిన దౌత్య కార్యాలయ పత్రాల ప్రకారం నజ్రుల్ ఇస్లాం, స్వీటీ అక్తర్ 2023 ఆగస్టు నుంచే సౌదీ అధికారుల నిర్బంధంలో ఉన్నారు. నజ్రుల్‌ను ఆగస్టు 1న సైబర్ నేరాల చట్టం కింద అదుపులోకి తీసుకోగా, స్వీటీని మరుసటి రోజు వ్యభిచార ఆరోపణలపై అరెస్టు చేసినట్లు పేర్కొంది. వీరిద్దరూ సౌదీలోని అల్ మజాల్ సంస్థలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసినట్లు వెల్లడైంది. అయితే, వారిపై మరణశిక్ష పెండింగ్‌లో ఉన్నట్లు దౌత్య కార్యాలయానికి అందిన ఖైదీల జాబితాలో సమాచారం లేదని కథనాలు పేర్కొన్నాయి.

### పూర్తి వివరాలు కోరిన బంగ్లాదేశ్

మరణశిక్ష అమలుకు దారితీసిన అభియోగాలు, న్యాయ విచారణ, తీర్పు వివరాలను అందించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం సౌదీ అరేబియాను కోరింది. తమ కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలను ఇద్దరి కుటుంబాలు ఖండించాయి. మరణశిక్ష అమలు గురించి ముందస్తు సమాచారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశాయి. మరోవైపు, నజ్రుల్, స్వీటీ భార్యాభర్తలనే ప్రచారంపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నజ్రుల్‌కు వివాహం కాలేదని ఆయన తండ్రి పేర్కొన్నట్లు నిజనిర్ధారణ కథనాలు వెల్లడించాయి. దీంతో మరణశిక్ష అమలు జరిగిన విషయం నిర్ధారణ అయినప్పటికీ, భారతీయుడి పాత్ర, వైరల్ వీడియోలు, ఇద్దరి మధ్య సంబంధం, అసలు అభియోగాల స్వరూపం వంటి అంశాలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

# మరో 30 ఏళ్లు కాంగ్రెస్ అధికారానికి దూరమే

- రాహుల్‌పై అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు
- మరో 30 ఏళ్లపాటు కాంగ్రెస్ అధికారానికి దూరమేనంటూ వ్యాఖ్యలు
- ప్రజల్లోకి వెళ్లకుండా నిరసనలు చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్న
- ఓటు చోరీ ఆరోపణలపై కాంగ్రెస్, మిత్రపక్షాలకు కౌంటర్
- చొరబాటుదారుల ఓట్లను కాపాడేందుకే ఆరోపణలంటూ విమర్శలు
- ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదని ఎద్దేవా



**న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మరో 30 ఏళ్లపాటు ఆయన పార్టీ అధికారానికి దూరంగా ఉంటుందని జోస్యం చెప్పారు. "మీరు విదేశాల్లో ఉండటంతో నా మాటలు వినలేరని నాకు తెలుసు. మీరు ఎందుకు విదేశాలకు వెళ్తారో చెప్పరు. సరేలే.. అది మీ వ్యక్తిగతం. కానీ ఒకసారి ఢిల్లీకి తిరిగివచ్చిన తర్వాత నా మాటలు వినండి. మరో 30 ఏళ్ల వరకు మీరు అధికారంలోకి రారు" అని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అలాగే, దేశ రాజధానిలో నిరసనల గురించి అమిత్ షా స్పందించారు. నిరసనలు, ప్రదర్శనల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, రాజకీయ నాయకులు ప్రజాసంక్షేమంపై దృష్టిపెట్టాలని సూచించారు. "గుంపులుగా రావడం, రాజకీయ గారడీ వల్ల ప్రజాతీర్పును ధిక్కరించడం సాధ్యం కాదు. ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలి. మీరు ఎన్నికైన చోటల్లా సంక్షేమ పథకాలు అమలు చేయండి. లేదంటే మిగిలిన ప్రాంతాల్లో ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోతారు" అని విపక్ష పార్టీలకు సూచించారు. "రాహుల్‌జీ.. మీరు చొరబాటుదార్ల ఓట్లను కాపాడాలని అనుకుంటున్నారు కాబట్టే ప్రతిసారి 'ఓటు చోరీ' గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు భాజపాపై ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్నాయి. కానీ, ఆ పార్టీలు మాత్రం పలు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్నాయి. భాజపా 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని నేను చెప్పగానే.. వెంటనే ఓటు చోరీ అంటూ ఆరోపిస్తారు. అమిత్‌షాకు ఎన్నికల ఫలితాలు ముందుగానే ఎలా తెలుస్తాయని అడుగుతుంటారు. అమిత్ షా ఇక్కడే పుట్టారు. ఈ దేశంలోనే నివసిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. నేను ఈ ప్రజల మధ్యే నివసిస్తున్నాను" అంటూ విపక్షాల నిరసనలకు అమిత్ షా కౌంటర్ ఇచ్చారు.

# పండగ వేళ పసిడి ధరలు పతనం..

## వెండి కూడా దిగొచ్చింది!

- బంగారం, వెండి కొనుగోలుదారులకు ఊరట
- హైదరాబాద్‌లో పది గ్రాముల మేలిమి బంగారం రూ.1,47,348
- రూ.2.06 లక్షలకు తగ్గిన కిలో వెండి ధర
- అంతర్జాతీయ మార్కెట్‌లో వారం రోజుల కనిష్ఠానికి పసిడి
- చమురు ధరల సెగతో ద్రవ్యోల్బణ భయాలు.. వడ్డీ రేట్లపై అనిశ్చితి
- ఇతర పెట్టుబడుల వైపు మళ్లుతున్న మదుపర్లు



**హైదరాబాద్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** బంగారం, వెండి కొనాలనుకునే వారికి తీపివార్త. పండగల వేళ వీటి ధరలు దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులతో ఈ లోహాల ధరలు తగ్గుతున్నాయి. చమురు మంటల భగభగలతో ద్రవ్యోల్బణ భయాలు, ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చనే ప్రచారంతో వాటి గిరాకీ తగ్గుతోంది. గురువారం ఉదయం హైదరాబాద్ విపణిలో మేలిమి 10 గ్రాముల పసిడి ధర రూ. 1,47,348 పలుకుతోంది. కేజీ వెండి ధర రూ.2.06 లక్షలకు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర నేడు 4089 డాలర్లకు దిగొచ్చింది. దాదాపుగా వారం రోజుల కనిష్ఠాలకు చేరింది. ఇక వెండి కూడా ఔన్సు ధర 56.32 డాలర్లకు పడిపోయింది. గోల్డ్ ఫ్యూచర్స్‌లో 10 గ్రాముల ధర రూ. 1.44 లక్షలుగా ఉంది. సిల్వర్ ఫ్యూచర్స్ కేజీ ధర రూ. 2.03లక్షల వద్ద ట్రేడవుతోంది. పశ్చిమాసియాలో ఘర్షణలతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు 110.5 డాలర్లపైనే కదలాడుతోంది. సౌదీ అరేబియాలోని అరామ్‌కో సంస్థపై కొనసాగుతున్న హూతీల దాడులు, సరఫరా అంతరాయాలతో ఈ ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో ద్రవ్యోల్బణ భయాలు పెరిగాయి. ఈ ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించకపోవచ్చనే అంచనాలున్నాయి. వచ్చేవారం అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లపై ప్రకటన ఉండనుంది. ఈ నేపథ్యంలో రాబడులు లేని బంగారంపై కంటే ఇతర పెట్టుబడుల వైపు మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. రూపాయి బలపడటం కూడా మరో కారణం.

# సీజేపీ నిరసనతో నాకు సంబంధం లేదు!

ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థి సంఘం అధ్యక్షురాలు నేహా బోరా

రూ.10 వేల వ్యక్తిగత బాండ్ నోటీసులను సవాల్ చేస్తూ పిటిషన్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన పిలుపుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరా ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. అక్టోబర్ 16న తనను అదుపులోకి తీసుకున్న తర్వాత రూ. 10 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించి శాంతిభద్రతలను కాపాడాలని ఆదేశిస్తూ జారీ చేసిన నోటీసులు ఆమె ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. నేహాబోరా తరుఫున న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. నేహాబోరా ఎలాంటి నేరాలకు పాల్పడలేదని, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యల్లో పాల్గొనలేదని ఆయన కోర్టుకు తెలిపారు. హింసను ప్రేరేపించేలా ఆమె ఎలాంటి పిలుపుఇవ్వలేదని వాదించారు. అక్టోబర్ 16న తిరంగా యాత్ర సమయంలో మండీ హౌజ్ వద్ద నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు విడుదలైన ఆమెకు అక్టోబర్ 18న ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నుంచి నోటీసు అందింది. రూ.10 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని, శాంతిభద్రతలను కాపాడాలని అందులో ఆదేశించారు. జంతర్ మంతర్‌ను అధికారికి నిరసన స్థలం నుంచి తొలగించినప్పటికీ, ఆంక్షలు ఉన్నప్పటికీ ప్రజల్ని కన్నాట్‌ప్లేస్ వైపు వెళ్లేలా నేహా బోరా ప్రేరేపించారని నోటీసుల్లో ఆరోపించారు. అయితే, నేహా బోరాను మండీ హౌజ్ చేరుకున్న 10-15 నిమిషాల్లోపే అదుపులోకి తీసుకున్నారని ఆమె న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆ రోజు శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎలాంటి చర్యలకు పాల్పడలేదని వాదించారు. మండీ హౌజ్‌లో కలుద్దామని నేహా బోరా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులో, ఎలాంటి హింసకు పిలుపునివ్వలేదని, ప్రజాశాంతికి విఘాతం కలిగించే ఉద్దేశం కనిపించడం లేదని న్యాయవాది పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు ఉన్నాయని, మండీ హౌజ్ ప్రాంతాలు ఆ పరిధిలోకి రావని న్యాయవాది కోర్టుకు తెలిపారు. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఇచ్చిన నోటీసుల్ని రద్దు చేయాలని నేహా బోరా తరుపున కోర్టును కోరారు.



# జైలు నుంచి బయటకు రాగానే మరో షాక్!

## సీజేపీ లీడర్లకు క్రైమ్ బ్రాంచ్ నోటీసులు

తిహార్ జైలు నుంచి విడుదలైన కొద్దిసేపటికే పోలీసుల చర్యలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** సీజేపీ లీడర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు బుధవారం రాత్రి ఢిల్లీలోని తిహార్ జైలు నుంచి విడుదలైన సంగతి తెలిసిందే. వీరికి ఆ వెంటనే ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు షాకిచ్చారు. జైలు నుంచి ఇద్దరూ బయటకు వచ్చిన కొద్ది సేపటికే నోటీసులు అందించారు. బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఈ నోటీసులు ఇచ్చారు. అక్టోబర్ 22, గురువారం మధ్యాహ్నం క్రైమ్ బ్రాంచ్ ఆఫీసులో విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. బీఎన్ఎస్ సెక్షన్ 233 ప్రకారం జారీ చేసిన నిబంధనల్ని పాటించకపోవడం వల్ల నమోదైన కేసుకు సంబంధించి విచారణకు రావాలని కోరారు. అలాగే, సీజేపీ నిరసన సందర్భంగా జంతర్‌మంతర్ వద్దకు అక్రమంగా దూసుకెళ్లారంటూ కూడా కేసు నమోదైంది. మరో సీజేపీ నేత అజింక్యా షిండేను కూడా పోలీసులు విచారించే అవకాశం ఉంది. ఈ నిరసనల్లో అతడి పాత్రపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. నిబంధనల్ని ఉల్లంఘించినందుకుగాను.. అక్టోబర్ 13న సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాలతో వారం రోజులు జుడీషియల్ కస్టడీలో ఉంచారు. దీనిలో భాగంగా తిహార్ జైలుకు తరలించారు. బుధవారం వీరికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. చెరో రూ.50,000 పూచీకత్తుపై విడుదల చేసింది కోర్టు. అయితే, మరో మూడు రోజుల జుడీషియల్ కస్టడీ కోరుతూ ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. మళ్లీ కస్టడీ అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. దీంతో బెయిల్‌పై ఇద్దరూ గురువారం సాయంత్రం విడుదలకాగా.. ఆ వెంటనే పోలీసులు మరో నోటీసు జారీ చేశారు.

# సౌదీ విమానాశ్రయంపై దాడి

## భారతీయుడు మృతి!

దమ్మామ్ విమానాశ్రయంపై దాడితో కలకలం

ఎనిమిది మందికి గాయాలు..



**దమ్మామ్, అక్టోబర్ 22 (సమయం న్యూస్):** సౌదీ అరేబియాపై యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల దాడులు తీవ్రమవుతున్నాయి. దమ్మామ్ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఒక భారత పౌరుడు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత భారత అధికారులు సంబంధిత మృతుల కుటుంబాలను సంప్రదిస్తున్నారు. మృతుల కుటుంబాలకు, ఆత్మీయులకు భారత అధికారులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సౌదీ అధికారుల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను భారత రాయబార కార్యాలయ అధికారులు సేకరిస్తున్నారు. సౌదీ అధికారుల ప్రకారం.. బుధవారం సాయంత్రం దమ్మామ్ విమానాశ్రయంపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఒక సౌదీ పౌరుడు, ఒక భారతీయుడు ప్రాణాలు కోల్పోయినట్లు సౌదీ అరేబియా పౌర విమానయాన సాధారణ ప్రాధికార సంస్థ తెలిపింది. ఈ దాడిలో మొత్తం ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరు భారతీయులు, ఇద్దరు యెమెన్ పౌరులు, ఇద్దరు బంగ్లాదేశ్ పౌరులు, ఒక నేపాల్ వ్యక్తి ఉన్నారు.

# ఘనంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర...





**చేవెళ్ల, అక్టోబర్ 22 (సమయం న్యూస్)**

దసరా పండుగను పురస్కరించుకొని ఘనంగా నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది. గ్రామంలో అమ్మవారి విగ్రహ ఊరేగింపు పురవీధుల గుండా ఘనంగా సాగింది. అమ్మవారి నామ స్మరణతో, ఆధ్యాత్మిక భజన గీతాలాపనతో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది.అమ్మవారి శోభాయాత్రకు విచ్చేసిన భక్తులకు యూత్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.తాళ్లపల్లి గ్రామంలో మహిళలు అమ్మవారికి హారతి ఇవ్వడానికి పోటీపడ్డారు పెద్దలు భక్తిశ్రద్ధలతో నృత్యాలు, డీజే డ్యాన్సులతో అంగరంగ వైభవంగా గ్రామమంతా భక్తి పరవశంతో మునిగిపోయేలా చేశారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి అలంకరణలో ఉపయోగించిన చీరలు, అమ్మవారి మెడలోని హారాలు మొదలైన వస్తువులను వేలం వేయగా, భక్తులు పోటీపడి దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ యువజన నాయకులు, దుర్గామాత భక్తుల పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ప్రత్యేక పూజలు అమ్మవారిని నిమజ్జనం చేశారు.

# షాబాద్ మండలం తాళ్లపల్లిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి

**చేవెళ్ల, అక్టోబర్ 22 (సమయం న్యూస్):**




షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో పండుగ సాయన్న జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో పుట్టిన పండుగ సాయన్న పేద ప్రజలకు అండగా నిలబడ్డ మహావీరుడని, భూస్వాముల వద్ద అక్రమంగా పోగుచేసుకున్న సంపదను కొల్లగొట్టి పేద ప్రజలకు పంచిన గొప్ప ధీరుడని చరిత్ర చెబుతోందన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి బలశాలి అయినటువంటి పండుగసాయనను ఆధిపత్య శక్తులైన దేశ్ముకులు, కర్ణం పటేల్లు, భూస్వాములు, ఆయనను ఏమి చేయలేక నిజాం సర్కార్ తోటి కుమ్మక్కై పతకం వేసి పండుగ సాయన్నను చంపించారు.అలాంటి గొప్ప వ్యక్తి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఇక నుంచి ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో తెలంగాణ మొత్తం పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వాతి మాణిక్యం గౌడ్, వార్డు మెంబర్లు మాధవ్ చారి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సెక్రటరీ నాగభూషణం, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు పసుల కుమార్, మేకల శ్రావణ్, మేకల కృష్ణ, గ్రామ పెద్దలు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం:ఇదే కార్యక్రమంలో షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తికి గత నెల రోజుల క్రితం శంషాబాద్ లో జరిగిన బస్సు ప్రమాదంలో కాలు తొలగించడం జరిగింది. కుటుంబానికి తాళ్లపల్లి మాజీ వార్డు మెంబర్ రూ. 10,000 సహాయం అందజేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- **సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి**

**హనుమకొండ, అక్టోబర్ 22 (సమయం న్యూస్)**



వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఇనగాల వెంకట్రాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహాలు, పట్టభద్రుల ఓటరు నమోదు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల సమన్వయంపై చర్చించారు. ప్రతి డివిజన్‌లోనూ పట్టభద్రులను గుర్తించి, ఫారం18 ద్వారా ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు.ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో ఇటీవల నిర్వహించిన విస్తృత స్థాయి సన్నాహక సమావేశం విజయవంతమైందన్నారు. ఆ సమావేశ స్ఫూర్తితో హనుమకొండ జిల్లాలోని ప్రతి డివిజన్, మండల స్థాయిలో సమన్వయ కమిటీల ఏర్పాటును వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యావంతుల కోసం తీసుకుంటున్న నిర్ణయాలు, రికార్డు స్థాయిలో చేపట్టిన ఉద్యోగ నియామకాల వివరాలను పట్టభద్రుల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి డివిజన్ అధ్యక్షుడు తన పరిధిలోని పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న బలాన్ని మరోసారి నిరూపిస్తూ సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో శాసనమండలికి పంపేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే పార్టీ శ్రేణుల ముందున్న తక్షణ కర్తవ్యమన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేయాలని సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ అధ్యక్షుడు విద్యావంతులు, నిరుద్యోగులు, పట్టభద్రులను కలిసి ఫారం18 ద్వారా ఓటరుగా నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యావంతుల కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పక్కా ప్రణాళికతో అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పాల్గొన్న పీసీసీ ప్రధాన కార్యదర్శులు, మాజీ కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నాయకత్వంలో, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి మార్గదర్శకత్వంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడతామన్నారు. ప్రతి డివిజన్‌లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ తొగరు జగన్ మోహన్ రెడ్డి, కోకన్వీనర్ బోడ డిన్న, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం.డి. అజీజ్ ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భట్టి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, తోట వెంకటేశ్వర్లు, విజయశ్రీ రజాలీ, తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, వేముల శ్రీనివాస్, నెక్కొండ కిషన్, డీసీసీ మీడియా, కమ్యూనికేషన్ కమిటీ ఛైర్మన్ మార్క విజయ్ కుమార్‌తో పాటు డివిజన్ అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పండుగ సాయన్న 174 జయంతి వేడుకలు

**అక్టోబర్ 23(హత్నూర సమయం న్యూస్**



సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు పండగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి అంబేద్కర్ విగ్రహం నుండి రాజీవ్ గాంధీ విగ్రమ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఓ ఫంక్షన్లో ఏర్పాటుచేసిన సభ ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీలం మధు ముదిరాజ్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న పోరాట యోధుడు, ప్రజల కోసం పోరాడిన వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను హత్నూర ముదిరాజ్ సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పండుగ సాయన్న సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంతో ముందుకెళ్లి రాబోయే ఎన్నికల్లో కనీసం పదిమంది ఎమ్మెల్యేలను గెలిపించుకుందాం అన్నారు నా ఎదుగుదలను ఓర్వలేక రాజకీయంగా అనేక కుతంత్రాలు చేస్తున్నప్పటికీ అన్నిటిని ఎదుర్కొని ముందుకెళ్ళడమే మన ఏకైక లక్ష్యమని ఆయన ఉద్బోధించారు. ముతరాజులంతా ఏకమై ఒకే గొడుగు కింద నడవాలని ఆయన పిలుపునిచ్చారు. పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో అన్యాయాలను ఎదుర్కొంటూ, తనదైన పోరాట పంథాలో ముందుకు సాగిన ఆయనను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకుంటున్నారని తెలిపారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన వీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.తెలంగాణ ప్రాంత చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన ధైర్యసాహసాలు, పోరాట పటిమ, ప్రజల్లో ఆయనకున్న గుర్తింపు చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు. పండగ సాయన్న జయంతి వేడుకలను నిర్వహించడం ద్వారా చారిత్రక వీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. పండుగ సాయన్న వంటి పోరాట యోధుల చరిత్రను యువత తెలుసుకోవాలని, సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం వంటి విలువలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. చరిత్రలో ప్రజల కోసం పోరాడిన మహనీయులను స్మరించుకోవడం మన సంస్కృతిలో భాగమని నేటి యువత ఆయన పోరాటపటిమను స్మరించుకుంటూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండల కమిటీ అధ్యక్షులు రాజేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు అంబటి అర్జున్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్రే కృష్ణ ముదిరాజ్ సుజాత సత్యం ముదిరాజ్, కొన్యాల సతీష్ ముదిరాజ్,ఆయా గ్రామాల ముదిరాజులు నాయకులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో

- **రైల్ సంవాద్**
- **మహిళల వాష్‌రూమ్‌లు వెంటనే అందుబాటులోకి తేవాలి**
- **ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్, ఎంఎంటీఎస్ సమయాల మార్పుపై ప్రయాణికుల విజ్ఞప్తి**

**మల్కాజిగిరి, అక్టోబర్ 22 (సమయం):**

మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రైల్ సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ డివిజన్ పరిధిలోని ఈ స్టేషన్‌లో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ డి.ఎస్. రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు, కాలనీ సంఘాల సభ్యులు, ప్రయాణికులు, ప్రజలు పాల్గొని పలు సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ అహ్మద్ అలీ మాట్లాడుతూ, మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల సౌకర్యాలను, ముఖ్యంగా మహిళల కోసం ఏర్పాటు చేయాల్సిన వాష్‌రూమ్‌లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గత రెండేళ్లుగా మహిళా ప్రయాణికులు ఈ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను ఇకనైనా ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.జంట నగరాల్లోని ప్రధాన రైల్వే స్టేషన్లపై రద్దీని తగ్గించి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మల్కాజిగిరి స్టేషన్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. రోజువారీ ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా ఎంఎంటీఎస్ రైళ్లతో పాటు సిద్ధిపేట రైలు సమయాలను కూడా సవరించాలని పలువురు తమ సూచనలు అందజేశారు.




# మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే అండ

- **దహన సంస్కారాల ఖర్చులకు రూ.లక్ష ఆర్థిక సాయం**
- **కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**

**హనుమకొండ, అక్టోబర్ 22 (సమయం న్యూస్)**

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సారయ్య కుటుంబానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. మాజీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త అయిన సారయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.దహన సంస్కారాలు, ఇతర కార్యక్రమాల ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు అందజేశారు. ఆయా కార్యక్రమాల ఏర్పాట్ల బాధ్యతలను డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్‌కు అప్పగించారు. సారయ్య మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



# సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

**వలిగొండ అక్టోబర్ 22 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సాయిబాబా ఆశీస్సులతో భక్తులకు, అవసరమైన వారికి అన్నదానం చేస్తూ సేవా కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. సాయిబాబా ట్రస్టు అధ్యక్షుడు గౌ కార్యదర్శి పంజాల రమేష్, కోశాధికారి చీకటిమల్ల వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నువ్వుల శ్రీనివాస్‌తో పాటు పలువురు దాతల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ అన్నదాన సేవలో భాగస్వాములవుతున్నారు. అన్నదానం మహాదానమనే భావనతో ప్రతి గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా సేవాభావాన్ని చాటుతున్నారు. భక్తి, మానవత్వం, సేవా స్ఫూర్తితో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో దాతృత్వ భావన పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక విలువలకు ప్రాధాన్యతనిస్తున్నారు.సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమానికి దాతలు తమ సహకారాన్ని అందిస్తూ, అన్నదాన కార్యక్రమం కొనసాగేందుకు తోడ్పడుతున్నారు.



# ఆయుష్ శాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 22( సమయం న్యూస్)**



నేషనల్ ఆయుష్ మిషన్ (NAM) ద్వారా ఆయుష్ శాఖలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 6 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు. అక్టోబర్ 23 నుంచి 29 వరకు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. పీజీ మెడికల్ ఆఫీసర్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్, డైటీషియన్, సైకాలజికల్ కౌన్సిలర్, యోగా ప్రొఫెషనల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పూర్తి వివరాలకు rajannasiricilla.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

## పండుగ సాయన్న ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

- సబ్ కలెక్టర్ ఉమా హారతి

**సంగారెడ్డి, అక్టోబర్ 22:(సమయం న్యూస్)**

అణగారిన, బడుగు బలహీన వర్గాల కోసం పండుగ సాయన్న చేసిన పోరాటం, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సబ్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని నివాళులర్పించారు. భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, అక్టోబర్ 22,(సమయం న్యూస్)**



2026: జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణకు మండలానికి ఆరుగురు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఒక్కో అధికారి 4-5 గ్రామాల్లో నిర్మాణాలను పర్యవేక్షిస్తూ, మొదటి, రెండో విడతల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను ప్రోత్సహించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రానున్న పది రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, గ్రామాల వారీగా లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులకు ప్రత్యేక చొరవతో సహకరించి, తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మెదక్ జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.

## ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ అక్టోబర్22(సమయం న్యూస్.)**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు సహకరించాలని కోరారు.తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి నీ కలిసిన

- ముచ్చర్ల పంచాయతీ పాలకవర్గం

**అక్టోబర్ 23(హత్నూర సమయం న్యూస్ద**



సరా పండుగను పురస్కరించుకొని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గం ఇంచార్జ్ ఆవుల రాజు రెడ్డిని ముచ్చర్ల పంచాయతీ పాలకవర్గం సర్పంచ్ యాదగిరి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి కాలువతో సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బేగరీ యాదగిరి, ఉప సర్పంచ్ పార్వతి శేఖర్, వార్డు సభ్యులు నర్సింలు, చాకలి రాజు, యాదగిరి,బాల రాజు,కృష్ణ, మల్లేశం, మహేందర్, ఖదీర్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- మంత్రి తుమ్మల

**హైదరాబాద్, అక్టోబర్ 22(సమయం న్యూస్)**

పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతులకు ఎంఎస్‌పీ రూ.8,667 అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.తెలంగాణలో 335 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా గుర్తించారు. మార్కెట్ ధరలు, కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని సూచించారు. పత్తి ప్రాసెసింగ్, స్పిన్నింగ్ పరిశ్రమల విస్తరణకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

## ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి

**అదిలాబాద్ అక్టోబర్22(సమయం న్యూస్**

ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జిల్లాలో 35% వర్షపాతం లోటు ఉన్న నేపథ్యంలో తాగునీటి సరఫరా, పశువులకు మేత, రైతులకు భరోసా కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలపాలని, ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని సూచించారు. నీటి సంరక్షణ, సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.




# పండుగ సాయన్న ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

- సబ్ కలెక్టర్ ఉమా హారతి

**సంగారెడ్డి సమయం న్యూస్ సంగారెడ్డి, అక్టోబర్ 22:-**



అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఆర్‌డీఓ ఉమా హారతి అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమా హారతి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన ఆయన ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, వివిధ కుల సంఘాల , అధికారులు, పాల్గొన్నారు.

# మోదీ, అమిత్ షా ప్రతిరూపాల ఘటనపై విచారణ జరపాలి

- గీసుగొండ పోలీసులకు బీజేపీ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్ ఫిర్యాదు

**గీసుగొండ, అక్టోబర్ 22 (సమయం న్యూస్) :**

కొత్తగూడెంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రతిరూపాలను రావణాసురుడి ప్రతిమపై ఉంచినట్లు వచ్చిన వార్తలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ గీసుగొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్ కోరారు. ఈ మేరకు గురువారం గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ఉన్నప్పటికీ, అవి చట్టబద్ధంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి, బాధ్యుల పాత్రపై విచారణ జరపాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. చట్టవిరుద్ధమైన చర్యలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బిల్లా రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, అడెపు రమేష్, ములక సత్యం, గీసుగొండ బీజేవైఎం అధ్యక్షుడు సల్లా శ్రావణ్, ఐలోని నరేందర్, కందుల రవివర్మ, 15వ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు దొమ్మటి రాజ్‌కుమార్, 16వ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎల్ నీనో ప్రభావం పై అక్కంపల్లిలో గ్రామ సభ కార్యక్రమం

**వలిగొండ అక్టోబర్ 22 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అక్కంపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం గ్రామసభకు జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి. శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి హాజరై, ఎల్‌నినో ప్రభావాల వల్ల ప్రజల దైనందిన జీవనంపై, వ్యవసాయ రంగంపై మరియు పంటల సాగు విధానాలపై కలిగే ప్రభావాలను గ్రామస్థులకు వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పులు, వర్షపాతం తగ్గే అవకాశాలు, పంటలకు కలిగే నష్టాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తక్కువ నీటిని వినియోగించే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామసభలో రైతులు చురుకుగా పాల్గొని, తక్కువ నీటితో సాగు చేయగల పంటల గురించి తమ అభిప్రాయాలను, సూచనలను తెలియజేశారు. దీంతో సమావేశం పరస్పర చర్చలతో ఆసక్తికరంగా సాగింది.అదేవిధంగా, గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధికి దోహదపడే వీబీజీ రామ్ జీ పథకం గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సోక్ పిట్స్ (నీటి ఇంకుడు గుంతలు) నిర్మించడం వంటి పనులను చేపట్టడం వల్ల వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టుకోవచ్చని, భూగర్భ జలాల పెంపునకు తోడ్పడటంతో పాటు గ్రామస్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశిరెడ్డి వేణుగోపాల్, ఉప సర్పంచ్ నిమ్మల కృష్ణ, వార్డు సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) స్వప్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీ చంద్ర మౌళి, గ్రామ రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.




# మృత హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసుల ఆర్థిక చేయూత

- రూ. 2.83 లక్షల సాయం అందజేత

**కుషాయిగూడ, అక్టోబర్ 22 (సమయం):**

మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ బి. పెంటయ్య కుటుంబానికి కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, ఆయన బ్యాచ్‌మేట్స్ ఆర్థికంగా అండగా నిలిచారు. సమిష్టిగా రూ. 2,83,500 సేకరించి, ఆయన భార్య బి. రాజమణికి అందజేశారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్, శివాజీనగర్‌కు చెందిన బి. పెంటయ్య (50) హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. 2326 నంబర్ కలిగిన ఆయన 2022 ఆగస్టు 15 నుంచి మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు. అనారోగ్య సమస్యల కారణంగా 2026 ఆగస్టు 31న ఉదయం 7 గంటల సమయంలో తన నివాసంలో అకస్మాత్తుగా కుప్పకూలారు. కుటుంబ సభ్యులు వెంటనే ఏఎస్ రావు నగర్‌లోని కనరా బ్యాంక్ జంక్షన్ సమీపంలో ఉన్న జెమ్‌కేర్ పౌలమి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.పెంటయ్య కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది రూ. 1,14,500, ఆయన బ్యాచ్‌మేట్స్ రూ. 1,69,000 చొప్పున కాకుండా, వరుసగా ఆ మొత్తాలను సేకరించారు. దీంతో మొత్తం రూ. 2,83,500ను ఆయన భార్య రాజమణికి వారి నివాసంలో అందజేశారు .ఈ సందర్భంగా కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చి. నరేందర్ రావు, ఇన్‌స్పెక్టర్ జి. మల్లేష్, లింగారెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది, పెంటయ్య బ్యాచ్‌మేట్స్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట కాలంలో కుటుంబానికి అండగా ఉంటామని, మృతుని కుటుంబానికి రావాల్సిన సర్వీస్ సంబంధిత ప్రయోజనాలు, ఇతర అర్హత కలిగిన ప్రయోజనాలు త్వరగా అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.



# రేగడి ఘనపూర్ లో దళితులపై దాడిని ఖండిస్తున్నాం

- బాధితులకు న్యాయం జరగకపోతే ఉద్యమం తప్పదు

**చేవెళ్ల, అక్టోబర్ 22 (సమయం న్యూస్)**



రేగడి ఘనపూర్ గ్రామంలో దళితులపై జరిగిన దాడిని ఎంఆర్పీఎస్ తీవ్రంగా ఖండిస్తోందని, బాధితులకు న్యాయం జరగకపోతే ఉద్యమం తప్పదని ఎంఆర్పీఎస్ నాయకులు హెచ్చరించారు. గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు చేవెళ్ల మండలంలోని ఏసీపీ, సీఐ, ఎస్ఐలను కలిసి కేసు వివరాలు తెలుసుకొని ఎఫ్ఐఆర్ కాపీ తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఘటన వివరాలు: రేగడి ఘనపూర్ గ్రామంలో దసరా పండుగ రోజు బైండ్ల భాస్కర్ గ్రామంలో బతుకమ్మ వద్ద డప్పు కొడుతుండగా పాపన్నగారి పర్మారెడ్డి, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి వచ్చి "మా వాళ్లు బతుకమ్మ ఆడే వరకు మా ఇంటి దగ్గరే డప్పు కొట్టాలి" అని దుర్భాషలాడారని బాధితుడు తెలిపాడు. "మీ ఇంటి దగ్గర డప్పు కొడితే గ్రామంలో ఉన్న గ్రామ పెద్దలు నన్ను అడుగుతారు" అని చెప్పి వెళ్లిపోతుండగా "నీ సంగతి చెబుతా" అంటూ "మాదిగ లం... కొడకల్లారా" అని కులం పేరుతో బూతులు తిడుతూ అందరూ చూస్తుండగా దాడి చేసి కొట్టారని బాధితుడు పేర్కొన్నాడు.ఈ విషయంలో అదే రోజు రాత్రి 10:30 గంటలకు చేవెళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసును నిర్వీర్యం చేయడం కోసం భాస్కర్ పై దాడి చేసిన నిందితులు కౌంటర్ కేసు ఫైల్ చేయడం సరైనది కాదని, ఏసీపీ గారు, సీఐ గారు ఈ కౌంటర్ కేసు తప్పుడు కేసు కనుక వెంటనే భాస్కర్ మీద పెట్టిన కౌంటర్ కేసును తొలగించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనందున వెంటనే భాస్కర్ పై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు, రహదారుల దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రావుగళ్ల బాబు మాదిగ ఎంఆర్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు, చేవెళ్ల మండల మాజీ అధ్యక్షులు ఊరెట ప్రవీణ్ మాదిగ, మొయినాబాద్ మండల అధ్యక్షులు రామగాళ్ల కుమార్ మాదిగ, చేవెళ్ల ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు కొండాపురం మల్లేష్ మాదిగ, ఈదులపల్లి రాములు మాదిగ, కొండిగారి మహేందర్ మాదిగ, చేవెళ్ల మల్లికార్జున్ మాదిగ, ఇంద్రుపాటి రవి మాదిగ, మడికట్టు రాజేందర్ మాదిగ, షాబాద్ మండలం వినోద్ మాదిగ, బండ్లగూడెం శీను మాదిగ, గడ్డమల్ల రామచందర్, చెనుగోముల హనుమంతు, రాయికంటి పొండు వార్డు సభ్యులు, ఎంఆర్పీఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**నిజామాబాద్, అక్టోబర్ 22(సమయం న్యూస్):**

ఈ నెల 24, 26 తేదీల్లో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కంప్యూటర్ బేస్డ్ పరీక్షలకు అర్సపల్లిలోని ఏవీ ఎంటర్‌ప్రైజెస్ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు.పరీక్షా కేంద్రంలో కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్, ఇంటర్నెట్, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని సూచించారు.మొదటి సెషన్: ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు; గేట్లు ఉదయం 9.30కి మూసివేత.రెండో సెషన్: మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు; గేట్లు మధ్యాహ్నం 2 గంటలకు మూసివేత.నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.



# న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

**4 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ!**

- తొలి టీ20లో కివీస్‌కు షాకిచ్చిన టీమిండియా
- 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- 19.4 ఓవర్లలో 230 పరుగులు చేసి సంచలన విజయం
- 67 పరుగులతో చెలరేగిన సంజు శాంసన్
- చివర్లో నామన్ ధీర్ మెరుపులు.. 15 బంతుల్లోనే 42 పరుగులు
- వృథా అయిన గ్లెన్ ఫిలిప్స్ 82 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్




**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 22:** న్యూజిలాండ్ పర్యటనలో భారత జట్టు విజయంతో శుభారంభం చేసింది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన తొలి టీ20లో ఆతిథ్య న్యూజిలాండ్‌పై భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో ఒక దశలో వరుస వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన టీమిండియా చివర్లో అద్భుతంగా పుంజుకుంది. సంజు శాంసన్ మెరుపు అర్ధశతకం, శ్రేయాస్ అయ్యర్ కీలక ఇన్నింగ్స్, నామన్ ధీర్ విధ్వంసక బ్యాటింగ్‌తో కివీస్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. న్యూజిలాండ్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 225 పరుగులు చేయగా, భారత్ 19.4 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. సీఫర్ట్ 17 బంతుల్లో 24 పరుగులు చేయగా, ఫిన్ అలెన్ 24 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 45 పరుగులు సాధించాడు. డారిల్ మిచెల్ 19 బంతుల్లో 28 పరుగులు చేశాడు. అనంతరం గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 40 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, మూడు సిక్సర్లతో అజేయంగా 82 పరుగులు చేసి న్యూజిలాండ్‌కు భారీ స్కోరు అందించాడు. బెవోన్ జాకబ్స్ 16 బంతుల్లో 31 పరుగులు జోడించడంతో కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 225 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో వికెట్ పడగొట్టారు. అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లలో 51 పరుగులు సమర్పించుకోగా, భువనేశ్వర్ కుమార్ 49 పరుగులు ఇచ్చాడు. 226 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. అభిషేక్ శర్మ కేవలం 12 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 29 పరుగులు చేసి కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరోవైపు సంజు శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 33 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 67 పరుగులు చేసి లక్ష్య ఛేదనకు బలమైన పునాది వేశాడు. అయితే అభిషేక్ శర్మ ఔటైన తర్వాత భారత ఇన్నింగ్స్‌లో అనూహ్య మలుపులు చోటుచేసుకున్నాయి. సంజు శాంసన్ 67 పరుగుల వద్ద పెవిలియన్ చేరగా, తిలక్ వర్మ ఆరు పరుగులకే ఔటయ్యాడు. ఇషాన్ కిషన్ కూడా ఒక్క పరుగుకే వెనుదిరిగాడు. దీంతో భారత్ ఒక దశలో 122 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. వరుస వికెట్ల పతనంతో కష్టాల్లో పడిన భారత జట్టును కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్ ఆదుకున్నారు. వీరిద్దరూ సమయోచితంగా బ్యాటింగ్ చేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. శ్రేయాస్ అయ్యర్ 28 బంతుల్లో 42 పరుగులు చేయగా, అక్షర్ పటేల్ 14 బంతుల్లో 24 పరుగులు సాధించాడు. ఈ ఇద్దరి కీలక భాగస్వామ్యంతో భారత్ తిరిగి విజయంపై ఆశలు పెంచుకుంది. అయితే అక్షర్ పటేల్, శ్రేయాస్ అయ్యర్ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో మ్యాచ్ మరోసారి ఉత్కంఠగా మారింది. చివరి ఓవర్లలో భారత విజయానికి వేగంగా పరుగులు అవసరమైన పరిస్థితి ఏర్పడింది. మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా మారిన సమయంలో నామన్ ధీర్ క్రీజులో నిలబడి అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శించాడు. న్యూజిలాండ్ బౌలర్లపై ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఎదురుదాడికి దిగాడు. కేవలం 15 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో అజేయంగా 42 పరుగులు చేసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. చివరి వరకు క్రీజులో నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. నితీశ్ కుమార్ రెడ్డి రెండు పరుగులతో నాటౌట్‌గా నిలిచి అతడికి సహకరించాడు. దీంతో భారత్ 19.4 ఓవర్లలో ఆరు వికెట్లకు 230 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారీ స్కోరు నమోదు చేసినప్పటికీ భారత బ్యాటర్ల దూకుడు ముందు న్యూజిలాండ్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. తొలి టీ20లో ఉత్కంఠ విజయంతో భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనను విజయవంతంగా ప్రారంభించింది.



## ఆర్చరీలో శీతల్ దేవి అద్భుతం

**పారా గేమ్స్‌లో రెండో స్వర్ణం**

**నగోయా:** శీతల్ దేవికి చేతులు లేవు. కానీ ఆమె ఆర్చరీలో దిట్ట. ఇండియన్ ఆర్చర్ శీతల్ దేవి.. ఏషియన్ పారా గేమ్స్‌లో రెండో స్వర్ణం గెలిచింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఈవెంట్‌లోనూ ఆమె గోల్డ్ మెడల్ గెలుచుకున్నది. ఉత్కంఠంగా సాగిన ఫైనల్లో ఆమె సింగపూర్ అథ్లెట్ ఆలిమ్ నుర్ స్యాహిదాను ఓడించింది. తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్ టీమ్ గోల్డ్ మెడల్ గెలిచిన కొన్ని గంటల వ్యవధిలోనూ వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో శీతల్ దేవి అద్భుత ప్రదర్శన ఇచ్చి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నది. 19 ఏళ్ల వరల్డ్ చాంపియన్ శీతల్ దేవి 142-139 స్కోరుతో ఆలిమ్‌పై విజయం సాధించింది. 2023 హాంగ్‌జూ గేమ్స్‌లోనూ ఆమె ఆలిమ్‌పైనే విక్టరీ కొట్టింది. ప్రస్తుత పారా గేమ్స్‌లో శీతల్ దేవి ఖాతాలో మొత్తం మూడు పతకాలు ఉన్నాయి. మహిళల డబుల్స్ సిల్వర్ కూడా గెలిచిందామె.



## భళా సింధు..

**పారిస్, అక్టోబర్ 22 :** ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ సిరీస్‌లో పీవీ సింధు తొలిరౌండ్ అదరగొట్టింది. మహిళల సింగిల్స్ ఫస్ట్ రౌండ్‌లో సింధు 21-14, 8-21, 23-21తో థాయ్‌లాండ్ షట్లర్ సుపనిద కేట్‌థాంగ్‌పై గెలిచి రెండో రౌండ్‌కు చేరింది. నరాలు తెగే ఉత్కంఠ నడుమ గంటకు పైగా సాగిన పోరులో తొలి గేమ్‌ను ఈజీగానే గెలుచుకున్న ఈ తెలుగు తేజం.. రెండో గేమ్‌లో ప్రత్యర్థి పుంజుకోవడంతో వెనుకబడింది. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఆమె ఒక దశలో 8-19తో వెనుకంజలో ఉంది. ఈ స్థితిలో ఒక ప్లేయర్ వరుసగా పాయింట్లు సాధించి మ్యాచ్‌ను దక్కించుకోవడం అసాధ్యమే. కానీ సింధు మాత్రం దీనిని సుసాధ్యం చేసింది. ఆ దశలో ఏదో పూనకం వచ్చినట్టుగా ఆడిన సింధు.. వరుసగా 11 పాయింట్లు సాధించి 19-19తో స్కోర్లను సమం చేసింది. ఆ తర్వాత ఉత్కంఠ పోరులో 23-21తో గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కాగా పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్, లక్ష్యసేన్ ఫస్ట్ రౌండ్‌కే నిష్క్రమించగా ఉన్నతి హుడా, దేవికా కూడా తొలిరౌండ్ విఘ్నాన్ని దాటలేకపోయారు.

## హైదరాబాద్‌కు రెండో విజయం

**ఆంధ్రాపై గెలుపుతో గ్రూప్-బీలో అగ్రస్థానం**

**విజయవాడ:** రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో హైదరాబాద్ రెండో విజయాన్ని నమోదుచేసింది. ఎలైట్ గ్రూప్-బీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్.. ఆంధ్రాను 267 పరుగుల తేడాతో చిత్తుచేసి భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బౌలర్లు చెలరేగడంతో రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థి జట్టు బ్యాటర్లను 130 పరుగులకే కుప్పకూల్చింది. హైదరాబాద్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 275 రన్స్ చేయగా రెండో ఇన్నింగ్స్‌ను 306/7 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసి ఆంధ్రాను 184 రన్స్‌కే కట్టడిచేయడంలో కీలకపాత్ర పోషించిన స్పిన్ ఆల్‌రౌండర్ తనయ్ త్యాగరాజన్.. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ ఆరు (6/35) వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో గ్రూప్-బీలో హైదరాబాద్ 13 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది.



# ఆస్ట్రేలియా ఓడినా అగ్రస్థానం పదిలం!

**దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో కంగారూలకు ఓటమి ముప్పు**




**సెయింట్ జార్జ్ పార్క్, అక్టోబర్ 22 :** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఓటమి అంచున నిలిచినా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆ జట్టు అగ్రస్థానానికి ఎలాంటి ముప్పు లేకపోవడం విశేషం. సెయింట్ జార్జ్ పార్క్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా విజయానికి చేరువైంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసి ఇంకా 170 పరుగులు వెనుకబడి ఉంది. చివరి రోజు దక్షిణాఫ్రికా బౌలర్లను ఎదుర్కొని మ్యాచ్‌ను కాపాడుకోవడం కంగారూలకు సవాల్‌గా మారింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. మార్కో జాన్సన్, సైమన్ హార్మర్ కూడా రాణించడంతో ఆ జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి కేవలం 99 పరుగులకే కుప్పకూలింది. మార్కో జాన్సన్ ఐదు వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. దీంతో ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 326 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. భారీ ఆధిక్యం సాధించిన దక్షిణాఫ్రికా ఆస్ట్రేలియాను ఫాలోఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ కంగారూలు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లకు 156 పరుగులు మాత్రమే చేయగలిగారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఇంకా 170 పరుగులు వెనుకబడి ఉంది. ట్రావిస్ హెడ్ సెంచరీకి చేరువలో ఉండగా, స్టీవ్ స్మిత్ వంటి స్టార్ బ్యాటర్లు ఇంకా రావాల్సి ఉంది. అయితే దక్షిణాఫ్రికా పటిష్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొంటూ చివరి రోజు మొత్తం క్రీజులో నిలవడం ఆస్ట్రేలియాకు కత్తిమీద సాములా మారింది. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 81.82 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా 60 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధిస్తే ఆ జట్టు పాయింట్ల శాతం పెరిగినప్పటికీ మూడో స్థానంలోనే కొనసాగుతుందని అంచనా. ఆస్ట్రేలియా ఓడిపోయినా 75 శాతం పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటుంది. ఒకవేళ మ్యాచ్ డ్రాగా ముగిసినా రెండు జట్ల పాయింట్ల శాతాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే ఆస్ట్రేలియా మొదటి స్థానంలో, దక్షిణాఫ్రికా మూడో స్థానంలోనే కొనసాగనున్నాయి. ప్రస్తుతం అందించిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక వివరాల ప్రకారం ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ రెండో స్థానంలో కొనసాగుతోంది. దక్షిణాఫ్రికా మూడో స్థానంలో, బంగ్లాదేశ్ నాలుగో స్థానంలో ఉన్నాయి. భారత జట్టు ఐదో స్థానంలో ఉండగా, ఇంగ్లండ్ ఆరో స్థానంలో కొనసాగుతోంది. దీంతో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న రెండో టెస్టు ఫలితం ఎలా ఉన్నా అగ్రస్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీతో హ్యారీ బ్రూక్ విధ్వంసం

**శ్రీలంకపై ఇంగ్లాండ్ రికార్డుల మోత!**




**రావల్పిండి/హైదరాబాద్, అక్టోబర్ 22:** పాకిస్థాన్ వేదికగా రావల్పిండిలో జరుగుతున్న వన్డే ట్రై సిరీస్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. శ్రీలంకతో జరుగుతున్న మ్యాచ్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుతమైన ద్విశతకంతో విరుచుకుపడటంతో ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 429 పరుగుల కొండంత స్కోరు సాధించింది. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కేవలం 116 బంతుల్లోనే 21 ఫోర్లు, 10 సిక్సర్ల సాయంతో 174.13 స్ట్రైక్‌రేట్‌తో 202 పరుగులు చేసి మ్యాచ్ చివరి బంతికి నిష్క్రమించాడు. దీనితో వన్డే క్రికెట్‌లో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గా బ్రూక్ రికార్డు పుటలకెక్కిడు. బ్రూక్ మొదటి సెంచరీకి 75 బంతులు తీసుకోగా, ఆ తర్వాత కేవలం 36 బంతుల్లోనే రెండో సెంచరీ పూర్తి చేయడం విశేషం.

**జో రూట్, విల్ జాక్స్ అర్ధసెంచరీలు:**

బ్రూక్‌కు తోడుగా ఇంగ్లాండ్ బ్యాటర్లందరూ దాడికి దిగారు. విల్ జాక్స్ కేవలం 30 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 66 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, జో రూట్ 66 బంతుల్లో 69 పరుగులు చేశాడు. ఓపెనర్లు టామ్ బాంటన్ (50), బెన్ డకెట్ (29) కూడా జట్టుకు మంచి శుభారంభాన్ని ఇచ్చారు. చివరి 5 ఓవర్లలో ఇంగ్లాండ్ బ్యాటర్లు ఏకంగా 78 పరుగులు పిండుకోవడంతో శ్రీలంక బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లాలాగే 2 వికెట్లు తీయగా, అసిత ఫెర్నాండో, జనిత్ లియానాగే చెరో వికెట్ సాధించారు. శ్రీలంక ముందు ఇప్పుడు 430 పరుగుల భారాత్మక లక్ష్యం ఉంది.



# భాగ్యశ్రీ గ్లామర్ మెరుపులు

తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మరోసారి గ్లామరస్ లుక్‌తో సందడి చేశారు. సాయి అభ్యంకర్‌తో కలిసి ఆమె నటించిన బ్రేకప్ సాంగ్ 'రాధిమా' ఇప్పటికే 10 కోట్ల వ్యూస్‌కు చేరువవుతూ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదిస్తోంది. తాజాగా భాగ్యశ్రీ ధరించిన వైన్ మెరూన్ రంగు శాటిన్ గౌన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆఫ్‌షోల్డర్ నెక్‌లైన్, నడుము భాగంలో ముడతల డిజైన్, కిందివైపు సున్నితంగా పరుచుకున్న చిఫాన్ ఫ్యాబ్రిక్‌తో ఈ దుస్తులు ఆమెకు అందమైన రూపాన్ని అందించాయి. హై స్లిట్‌తో కూడిన గౌన్‌కు చిన్న పెండెంట్, చెవిపోగులు, మెరిసే చెప్పులు జతచేశారు. జుట్టును పైకి ముడివేసి సరికొత్త స్టైలింగ్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. శివకార్తికేయన్ సరసన తమిళ చిత్రం 'సేయోన్'లో భాగ్యశ్రీ నటించనున్నారు. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంతో పాటు, ఆమె నటిస్తున్న మలయాళ సినిమా 'ఆపరేషన్ గంగా' కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది





# సంప్రదాయ చీరకట్టులో శ్రీలీల సందడి

టాలీవుడ్‌లో తనదైన నటన, అద్భుతమైన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి శ్రీలీల మరోసారి సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ఆవిడ ధరించిన చీరకట్టు అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ధమాకా', 'భగవంత్ కేసరి' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. 'కిస్సిక్' పాటతో దేశవ్యాప్తంగా మరింత పాపులారిటీ సంపాదించారు. ఈసారి శ్రీలీల ఆవాల పసుపు రంగు రఫుల్స్ చీరలో కనిపించారు. అద్దాల అలంకరణతో కూడిన అంచులు, చిన్న పూల డిజైన్లు చీరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బంగారు రంగు ఎంబ్రాయిడరీతో రూపొందించిన స్లీవ్‌లెస్ బ్లౌజ్ ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేసింది. విరబోసిన జుట్టు, సహజమైన మేకప్‌తో సంప్రదాయానికి ఆధునిక శైలిని జోడించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న హిందీ రొమాంటిక్ మ్యూజికల్ చిత్రంలో శ్రీలీల నటించనున్నారు. మరోవైపు, అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ కుమార్ నటించనున్న సినిమాలోనూ ఆమె భాగం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది.





# ఆరెంజ్ డ్రెస్‌లో ఫౌజీ భామ క్యూట్ లుక్

డ్యాన్స్ రీల్స్‌తో సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇమాన్వీ.. తన అందం, హావభావాలతో నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే భారీ సంఖ్యలో అభిమానులను సంపాదించుకున్న ఈ భామ.. వెండితెరపై అడుగుపెట్టకముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా ఇమాన్వీ ఆరెంజ్ రంగు స్లీవ్‌లెస్ డ్రెస్‌లో మెరిశారు. స్క్వేర్ నెక్‌లైన్, కిందివైపు విస్తరించిన డిజైన్‌తో ఉన్న ఈ దుస్తులకు జుట్టులో తెల్లని రిబ్బన్, గోల్డ్ హూప్ చెవిపోగులు జతచేశారు. పలుచని లేయర్డ్ నెక్లెస్, ఉంగరం, బ్రేస్‌లెట్‌తో తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు. సహజమైన మేకప్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇమాన్వీ సినీ రంగ ప్రవేశం ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ఫౌజీ' చిత్రంతో జరగనుంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి చిత్రంతోనే వెండితెరపై ఇమాన్వీ ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రూటు మార్చిన స్వీటీ..

## లేడీ ఓరియెంటెడ్ కథలకు గ్యాప్!



టాలీవుడ్ కథానాయిక అనుష్క శెట్టి (స్వీటీ) తన కెరీర్ ప్లానింగ్‌ను పూర్తిగా మార్చేసింది. 'భాగమతి' తర్వాత కేవలం లేడీ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తూ వచ్చిన స్వీటీకి, ఇటీవల వచ్చిన 'ఘాటి' చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ మిగిల్చింది. దాంతో సోలోగా సినిమా భారాన్ని మోసే ఫార్ములాను పక్కనపెట్టి, భారీ తారాగణం ఉండే పెద్ద ప్రాజెక్టుల వైపు ఆమె చూపు తిప్పినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మలయాళ స్టార్ హీరో జయసూర్య నటిస్తున్న భారీ ఫాంటసీ థ్రిల్లర్ 'కథనార్'లో అనుష్క 'నీలి' అనే కీలక పాత్ర పోషిస్తోంది. రీసెంట్‌గా వచ్చిన ట్రైలర్‌లో తన లుక్‌తో మంచి బజ్ క్రియేట్ చేసింది. సోలో సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి, ఇలాంటి క్రేజీ మల్టీస్టారర్ కాన్సెప్ట్‌లతో మళ్లీ కమర్షియల్ ట్రాక్‌లోకి రావాలని అనుష్క భావిస్తోంది. త్వరలోనే ఆమెను మళ్లీ స్టార్ హీరోల సరసన చూసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# ఓటు రాజకీయాలతో అభివృద్ధిని అడ్డుకోవద్దు

- రాజకీయాలకు అతీతంగా సహకరించాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.2 కోట్లతో రహదారి విస్తరణకు శ్రీకారం!



**హనుమకొండ, అక్టోబర్ 22 (సమయం న్యూస్)**

వరంగల్ నగర భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యంగా రహదారుల విస్తరణ చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ బస్టాండ్ నుంచి జేఎన్ఎస్ స్టేడియం మీదుగా డీసీసీ భవన్ వరకు సుమారు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి విస్తరణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోందన్నారు. పాతకాలం నాటి రహదారులు ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదని, భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నగరాభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని, ప్రజల ప్రయోజనాల కోసం తీసుకునే నిర్ణయాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.హనుమకొండ బస్టాండ్ పరిసరాల్లో రహదారులు ఇరుకుగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్టాండ్ అభివృద్ధితోపాటు దానికి అనుసంధానంగా ఉన్న రహదారులను విస్తరించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలను తగ్గించవచ్చన్నారు. అందులో భాగంగానే బస్టాండ్ నుంచి జేఎన్ఎస్ స్టేడియం మీదుగా డీసీసీ భవన్ వరకు రహదారి విస్తరణ చేపడుతున్నట్లు వివరించారు. గతంలో సరైన ప్రణాళిక లేకుండా రహదారుల పక్కన భవనాలు, దుకాణాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం వల్ల ప్రస్తుతం విస్తరణ పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాయిని పేర్కొన్నారు. గతంలో ఈ రహదారిపై గుంతల కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. రహదారులను మెరుగుపరిచి, విస్తరించి సురక్షితమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.నగరాభివృద్ధికి సహకరించాల్సిన ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.అభివృద్ధి పనులను రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.జేఎన్ఎస్ స్టేడియం పరిసర ప్రాంతాలను కూడా సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రహదారి విస్తరణతోపాటు వాణిజ్య అవకాశాలను మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, ఆ నిధులను నగరాభివృద్ధి, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించే అవకాశం ఉంటుందని వివరించారు. స్టేడియం పరిసరాల్లోని వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడతామని తెలిపారు.వరంగల్, హనుమకొండ నగరాలు భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు సహకరిస్తే మెరుగైన రహదారులు, సులభమైన రవాణా,మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

# నేల తల్లిని సంరక్షించుకుంటేనే భవిష్యత్

- తరాలకు ఆహార భద్రత – మంత్రి తుమ్మల
- ఖేత్ బచావో అభియాన్‌తో భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయానికి శ్రీకారం
- రసాయన ఎరువులు, పురుగుమందులను శాస్త్రీయ పద్ధతుల్లోనే వినియోగించాలి
- వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలి
- సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలి
- పంట వ్యర్థాలను కాల్చకుండా మల్చింగ్‌కు వినియోగించాలి.. నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి




**హైదరాబాద్ అక్టోబర్22( సమయం న్యూస్)**

నేల తల్లిని సంరక్షించుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆహార భద్రత కల్పించగలమని, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోకుండా వ్యవసాయంలో ఆశించిన దిగుబడులు సాధించడం సాధ్యం కాదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నేల సారాన్ని పరిరక్షించడం, పంట భూములను సంరక్షించడం, ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమంతో పాటు భవిష్యత్ వ్యవసాయాన్ని దృష్టిలో పెట్టుకొని భూసార పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు.గురువారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన్' (సాగు భూమి సంరక్షణ) కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల పరిరక్షణ, భూసార పరీక్షలు, నీటి పొదుపు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక, సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పంట వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై రైతులకు కీలక సూచనలు చేశారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములను అందించాలంటే వ్యవసాయ పద్ధతుల్లో శాస్త్రీయ మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, ఋతుపవనాల తగ్గుదల, భూతాపం పెరుగుదల, వర్షపాతం అసమానతలు, వర్షాలు సకాలంలో కురవకపోవడం వంటి పరిస్థితులు వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూమి స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వినియోగించకుండా వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మోతాదుల్లోనే ఉపయోగించాలని మంత్రి స్పష్టం చేశారు. అధిక మోతాదుల్లో రసాయనాల వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు పడే ప్రమాదం ఉందని తెలిపారు. పంటల్లో రసాయనాల అవశేషాలు పెరిగితే ఆహార నాణ్యత, భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను పాటిస్తూ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ విధానాలను అనుసరించాలని సూచించారు.

ప్రతి రైతు తప్పనిసరిగా తన వ్యవసాయ భూమికి భూసార పరీక్షలు చేయించుకోవాలని మంత్రి కోరారు. నేలలో ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకొని, ఏ పంటకు ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో అవసరమో నిర్ధారించుకున్న తర్వాతే వాటిని వినియోగించాలని సూచించారు. దీనివల్ల అనవసరమైన ఎరువుల ఖర్చును తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి గ్రామం, ప్రతి రైతు భూమికి సంబంధించిన భూసార పరీక్షల వివరాలను క్రమబద్ధంగా నమోదు చేసి, రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులకు అవసరమైన సలహాలు అందించాలని, నేల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు.రైతులను సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించడంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలని మంత్రి పేర్కొన్నారు. సేంద్రీయ పద్ధతులు, జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడి వంటి విధానాల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కేవలం సూచనలు ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసి, తక్కువ పెట్టుబడితో స్థిరమైన దిగుబడులు సాధించేలా మార్గనిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు.భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి వినియోగంలో రైతులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి అన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ, తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, నీటి ప్రతి చుక్కను సమర్థవంతంగా వినియోగించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో భూమి రకం, నీటి వసతి, స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి రెండు మూడు తడులతో పండే స్వల్పకాలిక పంటలు, అపరాల పంటలను సాగు చేసుకునేలా రైతులకు సలహాలు ఇవ్వాలని సూచించారురైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించే దిశగా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ పంటలతో పాటు ప్రాంతానికి అనుకూలమైన ఉద్యాన పంటలను సాగు చేసే అవకాశాలను రైతులకు వివరించాలని సూచించారు. రైతులు పెట్టుబడి వ్యయం తగ్గించడం, నీటిని ఆదా చేయడం, పంటకు మార్కెట్‌లో లభించే ధర, నికర ఆదాయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం చేయాలని సూచించారు.వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకునే చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకొని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని, పొలాల్లోకి నీరు ఇంకేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, నేల కోత నివారణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాగుల్లో ఇసుకను అధికంగా తీయడం వల్ల నీటి నిల్వలు, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటూ, సహజ నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.పంట కోతల అనంతరం మిగిలే వ్యర్థాలను కాల్చివేయడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులకు నష్టం కలగడంతో పాటు గాలి కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని మంత్రి తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చకుండా వాటిని మల్చింగ్‌కు వినియోగించాలని, నేలలో తేమ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట వ్యర్థాలను సక్రమంగా వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు పశుపోషణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు అవసరమైన పశుగ్రాసం పెంపకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. పంట అవశేషాలను పశుగ్రాసంగా ఉపయోగించుకునే అవకాశాలను కూడా రైతులు పరిశీలించాలని సూచించారు.్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణను విస్తృతంగా వినియోగించడం ద్వారా రైతుల శ్రమ, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించవచ్చని మంత్రి అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద అర్హులైన రైతులతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పీఓలు) కూడా వ్యవసాయ పనిముట్లు అందిస్తామని తెలిపారు. ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు సమూహాల ద్వారా వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావడం వల్ల సాగు పనులు సకాలంలో పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఖేత్ బచావో అభియాన్‌ను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, వ్యవసాయ భూముల పరిరక్షణకు నిరంతరం కొనసాగాల్సిన ఉద్యమంగా తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారులు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించి, గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సాంకేతిక సలహాలు అందిస్తూ, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులను అవలంబించేలా ప్రోత్సహించాలని తెలిపారు. నేల ఆరోగ్యం, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, సేంద్రీయ వ్యవసాయం, పంట వ్యర్థాల సమర్థ వినియోగం వంటి అంశాలపై రైతుల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత స్థిరమైన, లాభదాయకమైన రంగంగా తీర్చిదిద్దవచ్చని మంత్రి పేర్కొన్నారు. రైతులు ప్రకృతి వనరులను కాపాడుకుంటూ, శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ తెలివిగా వ్యవసాయం చేయాలని సూచించారు. వ్యవసాయ భూములను సంరక్షించడం, నేల సారాన్ని పెంపొందించడం, నీటి వనరులను కాపాడుకోవడం వంటి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఖేత్ బచావో అభియాన్‌ను విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# కేటీఆర్'కు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ రవిచంద్ర

- దసరా వేళ ఆత్మీయ పలకరింపు.. కేటీఆర్‌కు ఎంపీ రవిచంద్ర శుభాకాంక్షలు

**వరంగల్, అక్టోబర్ 22 (సమయం న్యూస్)**

పండుగలు మనుషుల మధ్య ఆత్మీయతను పెంచుతూ, అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.టీ.రామారావును మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ రవిచంద్ర పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయంగా పలకరించారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత మరింత పెంపొందాలని, ప్రతి కుటుంబం ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.పండుగ వేళ కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి తన ఆత్మీయతను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్రతో పాటు బొగ్గుగని కార్మిక సంఘం ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, నాయకులు వీరభద్రం, ఊకంటి ప్రభాకర్‌రావు, జీ.కే. వీరంతా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.



## పత్తి పంటలో అంతర పంటగా గంజాయి

- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయి సాగు చేస్తున్న నిందితుడు.
- రూ.4 లక్షల విలువైన 40 గంజాయి మొక్కలు స్వాధీనం
- నిందితుడు అరెస్ట్, బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



**అదిలాబాద్ అక్టోబర్22( సమయం న్యూస్)**

గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా సిఫార్సు - బోథ్ సీఐ డి. గురుస్వామిబోథ్ మండలం నిగిని గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు గుర్తించారు. అతని వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో పెంచుతున్న 40 గంజాయి మొక్కలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిగిని గ్రామానికి చెందిన లక్ష్మన్ మదావి (51) తనకు గంజాయి తాగే అలవాటు ఉండటంతో గంజాయి కొనుగోలు చేసి వినియోగించిన అనంతరం మిగిలిన గంజాయి నుంచి విత్తనాలను సేకరించినట్లు విచారణలో వెల్లడించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తన వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో ఎవరికీ తెలియకుండా గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. మొత్తం 40 గంజాయి మొక్కలు గుర్తించారు. ఒక్కో మొక్క విలువ సుమారు రూ.10,000 చొప్పున మొత్తం రూ.4 లక్షలుగా అంచనా వేశారు. గంజాయి సాగు, విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని బోథ్ సీఐ డి. గురుస్వామి హెచ్చరించారు. గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా సంబంధిత శాఖలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఈ ఘటనపై బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు.. ఈ కార్యక్రమంల, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రె

- సిడెంట్ కేటీ రామారావు గారికి దసరా శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు వనరి గారి శ్రీకాంత్ అఖిల్

**అక్టోబర్ 23(హత్నూర సమయం. న్యూస్ )**



తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీ రామారావు గారికి టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు గురువారం నాడు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీ రామారావు గారు మాట్లాడుతూ పార్టీ పరిస్థితులు తాజా పరిమాణాలపై నేతలతో కొద్దిసేపు ముచ్చటించారు రాబోయే 2028లో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన పార్టీ శ్రేణులకు సూచించినట్లు హత్నూర మండల్ బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులకు తెలిపారు.

## రైస్ మిల్లుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, అక్టోబర్ 22( సమయం న్యూస్):**

రైస్ మిల్లుల నుంచి రావాల్సిన బకాయిలను సత్వరమే వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో బకాయిలు చెల్లించని డిఫాల్టర్ మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాలను రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం సీజ్ చేయాలని సూచించారు. బకాయిల వసూళ్ల ప్రక్రియను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని ఆదేశించారు.



## పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు 'పండుగ సాయన్న'

- కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీం నగర్ అక్టోబర్22( సమయం న్యూస్)**

నిజాం కాలంలో పెత్తందార్ల అన్యాయాలకు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది పేదలకు అండగా నిలిచిన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లో పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్వో స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకొని దోపిడీ చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.



## మర్యాదపూర్వకంగా కలిసిన

జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ను కలెక్టరేట్ లోని జిల్లా టి జి ఓ అధ్యక్షులు కృష్ణ యాదవ్, సభ్యులు జి ఆశన్న, డిఆర్ఓ డాక్టర్ నారాయణ, ఏ. ఓ వెంకట్రామిరెడ్డి,కమిటీ సభ్యులు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్థిక నేరాల నియంత్రణకు కృషి

- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, అక్టోబర్ 22(సమయం న్యూస్)**

వార్షిక తనిఖీల్లో భాగంగా మావల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, సిబ్బంది పనితీరు, డ్రిల్, పరిసరాలు, కేసుల దర్యాప్తు, సైబర్ క్రైమ్, పెట్రోలింగ్ తదితర అంశాలను పరిశీలించారు.నేరాలు అధికంగా నమోదయ్యే ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహించాలని, రాత్రి బీట్లు ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పెంచాలని ఆదేశించారు. దీర్ఘకాలిక కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చూడాలని, సిబ్బంది నిజాయితీగా విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ మావల ఎస్‌హెచ్ఓ బి.డి. ప్రేమ్ కుమార్, ఎస్ఐలు, పాల్గొన్నారు.



# మోడల్ బస్‌స్టాండ్ పనులు త్వరితగతిన పూర్తి

**ములుగు అక్టోబర్22(సమయం న్యూస్)**

ములుగు జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ బస్‌స్టాండ్ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఆమె నిర్మాణ పనులను పరిశీలించారు.ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తూ తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఫ్లోరింగ్ పనులు సురక్షితంగా చేపట్టాలని, పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.మిగిలిన పనులను సమన్వయంతో పూర్తి చేసి బస్‌స్టాండ్‌ను త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సూచించారు.



# భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక

**ములుగు, అక్టోబర్ 22:(సమయం న్యూస్)**

భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి పక్కా ప్రణాళిక రూపొందించి, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఆదేశించారు.
రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూభారతి దరఖాస్తులు, రీ సర్వే, భూసేకరణ, హైకోర్టు కేసులు, భూదాన్ భూములు, జీఓ 59 దరఖాస్తులపై సమీక్షించారు. పాత భూభారతి దరఖాస్తులను నవంబర్ 15లోగా, కొత్త దరఖాస్తులను స్వీకరించిన 30 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు.ములుగు నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్, ఆర్డీఓ కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్యం మేరకు రుణాలు మంజూరు

- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 22(సమయం న్యూస్)**



జిల్లాలోని బ్యాంకులు ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల మేరకు వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణం, మహిళా సంఘాలు, స్వయం ఉపాధి పథకాలకు 100 శాతం రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశంలో బ్యాంకుల వారీగా రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ తదితర పథకాల పురోగతిని సమీక్షించారు. శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి కోసం రుణాలు అందించాలని, మహిళా సంఘాలకు ప్రభుత్వ రుణాలపై అవగాహన కల్పించాలని సూచించారు.బ్యాంకర్లు, జిల్లా అధికారులు సమన్వయంతో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. PMJJBY, PMSBY బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి

**ఖమ్మం, అక్టోబర్ 22:(సమయం న్యూస్)**

వెట్టి చాకిరి, బానిసత్వం వంటి దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు. ఖమ్మం కలెక్టరేట్‌లో వెట్టి చాకిరి నిర్మూలనపై వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, అసంఘటిత రంగ కార్మికులకు అవగాహన కల్పించే ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్మికులు తమ హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహన కలిగి ఉండాలని, బలవంతపు పనులు లేదా తగిన వేతనం ఇవ్వకుండా పని చేయిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీల వంటి ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



# బదిలీపై వెళ్తున్న ఎస్సైకి ఆత్మీయ వీడ్కోలు

- **బదిలీతో మారేది కార్యస్థానమే.. డిసిసి ఉపాధ్యక్షుడు వేముల సాంబయ్య గౌడ్**
- **ఎస్సై అరుణ్ కుమార్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం**
- **విధి నిర్వహణలో నిబద్ధత.. ప్రజల ఆదరాభిమానాలే చిరుకానుక!**

**నర్సంపేట, అక్టోబర్ 22 (సమయం న్యూస్)**



పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రెండేళ్లపాటు విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎస్సై అరుణ్ కుమార్ ప్రజల మనసు చూరగొన్నారని డిసిసి ఉపాధ్యక్షుడు వేముల సాంబయ్య గౌడ్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై ని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.బదిలీల్లో భాగంగా ఎస్సై అరుణ్ కుమార్ జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నర్సంపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జ్ఞాపికను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ ఎస్సై అరుణ్ కుమార్ పట్టణంలో రెండేళ్లపాటు విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరిస్తూ సామాన్య ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుకూలంగా వింటూ, వాటి పరిష్కారానికి చొరవ చూపడం ద్వారా పట్టణ ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. బదిలీ ఉద్యోగ నిర్వహణలో సహజమైన భాగమని, నర్సంపేటలో ఆయన అందించిన సేవలు ప్రజలకు గుర్తుండిపోతాయని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోనూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దండెం రతన్ కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు మందరాజు, పట్టణ నాయకుడు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు ఘన సత్కారం

- **విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం.**

అఖిల రాజ్ ఫౌండేషన్ మండల అధ్యక్షులు సొక్కం స్వామి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు సాధించి వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించడం జరిగిందని అఖిల రాజ్ ఫౌండేషన్ మండల అధ్యక్షులు సొక్కం స్వామి అన్నారు. గురువారం రాయపోల్ మండలం ఆరేపల్లి వైద్య కళాశాల ఎంబిబిఎస్ సీట్లు సంపాదించిన విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రతిభ కనబరచడం గ్రామానికి గర్వకారణమని అన్నారు.ఆరేపల్లి గ్రామానికి చెందిన బొమ్మ మేరమ్మధనియాలు దంపతుల కుమారుడు బొమ్మ అనుక్ నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించి వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. అదేవిధంగా సుమంజిగారి మమతభాస్కర్ దంపతుల కుమార్తె సుమంజిగారి ఉదయశ్రీ రామగుండం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించి వైద్య విద్యను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు.విద్య ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని, విద్యతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించడం విద్యార్థుల కృషికి, పట్టుదలకు నిదర్శనమన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకు ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సహించాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా విద్యకు దూరం కాకుండా చూడాలని సూచించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం పట్టుదలతో చదివి ఉన్నత విద్యలో రాణించి తమ గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి పేదలకు అండగా నిలవాలని కోరారు.విద్యార్థులను ప్రోత్సహించడం, వారి విజయాలను గుర్తించి గౌరవించడం ద్వారా ఇతర విద్యార్థుల్లోనూ చదువుపై ఆసక్తి, పోటీతత్వం పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు అఖిల రాజ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు, మాజీ సర్పంచ్ కరుణాకర్, కొత్తపల్లి ఉప బీఆర్ఎస్ నాయకులు మల్లేశం, అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంపై గోపరాజుపల్లిలో గ్రామసభ

**వలిగొండ అక్టోబర్ 22 (సమయం న్యూస్)**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజు పల్లి గ్రామంలో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. రానున్న రోజుల్లో వర్షభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా ప్రత్యేక స్పెషల్ ఆఫీసర్ జగన్నాథ్ రావు మండల తహసిల్దార్ దశరథ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించడం వ్యవసాయ రంగానికి అవసరమైన నీటిని పొదుపుగా వినియోగించుకోవడం,రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు నీటి సంరక్షణకు ఉపయోగపడే పనులను గుర్తించి చేపట్టాలని అన్నారు.గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇప్పటినుంచే తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, మండల అధికారులు,గ్రామ సర్పంచ్ సలిగంజి పృధ్వి, ఉప సర్పంచ్ పోలబోయిన లింగస్వామి గ్రామ పంచాయతీ కార్యదర్శి నవనీత, మండల ఏపీవో పరశురాం టి ఏ నాగార్జున ఏ ఈ ఓ కిరణ్ గ్రామ పరిపాలన అధికారి పరశురాం గ్రామ క్షత్రియ అధికారి మర్రి సైదులు వార్డ్ సభ్యులు పాలకూరల బాలమ్మ కట్ట సుప్రజ సంగిశెట్టి సంతోష మేడి కుమార్, అంగన్వాడి టీచర్ మనమ్మ ఆశ కార్యకర్త నీలం నీరజ రైతులు పాల్గొన్నారు.

# తూప్రాన్‌లో కనుల పండువగా దుర్గాదేవి ఊరేగింపు





- **కోలాటాలు, భక్తి గేయాలతో మార్మోగిన పట్టణ వీధులు.. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి**

**తూప్రాన్, అక్టోబర్ 22: మెదక్ జిల్లా తూప్రాన్**

పట్టణంలో దుర్గాదేవి ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. శలాక రాజేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుక గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 8 గంటల వరకు కొనసాగింది.ఈ సందర్భంగా మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో కోలాటాలు ఆడుతూ అమ్మవారిపై తమ భక్తిని చాటుకున్నారు. భక్తి గేయాలు, కోలాటాల నడుమ సాగిన ఊరేగింపు పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.ఊరేగింపు మార్గంలో పండుగ వాతావరణం నెలకొనగా, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలను వీక్షించారు. భక్తి గీతాల ఆలాపన, కోలాటాల ప్రదర్శనతో పట్టణ వీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మహిళలు, యువత సంప్రదాయ కళారూపాలను ప్రదర్శిస్తూ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 12 గంటలపాటు కొనసాగిన ఈ ఊరేగింపు భక్తుల ఉత్సాహం మధ్య ఘనంగా ముగిసింది. దుర్గాదేవి ఊరేగింపు కార్యక్రమం తూప్రాన్‌లో భక్తిభావాన్ని, సంప్రదాయాల పట్ల ప్రజలకున్న అభిమానాన్ని చాటిచెప్పింది.అమ్మవారి శోభయాత్ర కార్యక్రమంలో దుర్గాదేవి భక్త బృందం, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ సమతా కాశిరెడ్డి, కౌన్సిలరులు చేలమల రాములు, ఐలేష్ యాదవ్, జైపాల్ యాదవ్, అరుణ శ్రీనివాస్, దుర్గం సబితా నగేష్, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు రఘుపతి, హరికృష్ణ, సర్కిల్ ఇన్స్ పెక్టర్ వెంకట రాజాగౌడ్, సబ్ ఇన్స్పెక్టర్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా అభివృద్ధికి స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలి





- **కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ఖమ్మం, అక్టోబర్ 22:(సమయం న్యూస్)**

జిల్లా అభివృద్ధికి అన్ని శాఖలు స్పష్టమైన స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో పనిచేయాలని కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. స్వల్పకాలిక లక్ష్యాలను ఆరు నెలల్లో 100 శాతం పూర్తి చేసి, ప్రతి నెలా పురోగతిని సమీక్షించాలని సూచించారు. విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణ, ఉపాధి, పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.
మిర్చి సహా వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. జిల్లాలో శిశు, మాతృ మరణాల తగ్గింపు, పోషకాహార లోపం నివారణ, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వసతి విద్యాసంస్థల్లో తాగునీటి సదుపాయాలపై వారంలో నివేదిక ఇవ్వాలని, ప్రభుత్వ సేవలను వేగవంతం చేసేందుకు ఆన్‌లైన్ వ్యవస్థలు, డ్యాష్‌బోర్డులను అభివృద్ధి చేయాలని సూచించారు. పట్టణాల్లో తాగునీరు, శుద్ధి వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆదేశించారు.